# మిసిమి

మాస పత్రిక

సెప్టెంబర్ - 2000



వెల-రూ. 8/-

# చిత్రకారుని గురించి



యానిబాల్ చరాచి
( 1560 - 1609 )

పదహారవ శతాబ్దిలో ఇటాలియన్ పెయింటింగ్‌ను పునరుజ్జీవింప చేయడంలో అత్యంత ప్రముఖ పాత్ర వహించిన కళాకారుల కుటుంబానికి చెందినవాడు యానబేల్ చరాచి. ఆ రోజుల్లో ఇటాలియన్ కళలో కృత్రిమత్వం ఉండేది. ఈ కృత్రిమత్వాన్ని ఎదుర్కోవడానికి యానిబేల్ తన సోదరుడు, జ్ఞాతి సోదరులతో కలిసి తన స్వస్థలమైన బొలొగ్నలో ఒక అకాడెమీని స్థాపించాడు. వారి కృషి ఫలితం ఊరకే పోలేదు. అక్కడ కళాభ్యాసం చేసిన తరువాతి తరం కళాకారులలో కొంతమంది నిజమైన అద్భుతమైన కళాకారులు తేలారు.

అతడు తన ముప్పై ఐదవ యేట తన స్వస్థలమైన బొలొగ్నను వదిలి రోమ్ వెళ్ళాడు. అక్కడ తన జీవితంలోకే అత్యద్భుతమైన గొప్ప కళాఖండాల నిర్మాణం జరిగింది. అక్కడ అతడు ఫార్‌నీసె గ్యాలరీకి వేసిన కుడ్య చిత్రాలు అద్భుతాలు. వీటిని మైకలాంజలో చిత్రాల తరవాత, అంతటివి అని విజ్ఞులు మెచ్చుకొన్నారు. అతడు మంచి స్నేహశీలి, పూర్తిగా తన కళా లోకంలోనే మునిగి పోయాడు. కాని అతనిలో ఒక నిర్వేదపు జీర ఉంది. చివరి రోజుల్లో అవసాద (కుంగిపోవడం) రుగ్మతకు లోనయ్యాడు.

యానిబాల్‌లో వైవిధ్యం ఉంది. కుడ్య చిత్రాలకు కొత్త ఊపిరి పోసి ఇహ సంబంధ అధో జీవితాన్ని చిత్రించాడు. ఒక ఆదర్శవంతమైన రామణీయక స్థల దృశ్యాలకు, వ్యంగ్య మర్యాదతో కూడిన చిత్రాలకు మార్గదర్శకుడయ్యాడు.

## ముఖచిత్రం : విజయుడైన బాకస్

ఈ బాకస్ చిత్రం పార్‌నీసె గాలరీ కప్పును అలంకరించిన అద్భుత చిత్రం. ద్రాక్ష ఆకుల కిరీటం, ఒక భుజాన పులితల, ఒక చేతిలో దండం, మరో చేత్తో బద్ధకంగా ద్రాక్షగుత్తిని పట్టుకొన్నాడు.

పార్‌నీసె గాలరీ బాణాకృతి పై కప్పును అలంకరించిన సుందర కేంద్రక దృశ్యం. ఇది ప్రేమ విజయాన్ని - బాకస్, అరియద్నల కాముక ప్రేమ విజయాన్ని - చాటుతుంది. మర్త్య ప్రేమికుడు వదిలి వేసిన అరియద్నను బాకస్ రక్షించి, సేదతీర్చి, ఓదార్చి, ప్రేమించి పెళ్ళి చేసుకొంటాడు ద్రాక్షదేవుడైన బాకస్.

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 12 సెప్టెంబరు 2000 సంచిక 9

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక

ఫానన్ వాదం: FANONISM - బి. తిరుపతిరావు

రావిశాస్త్రి 'అల్పజీవి' : మనో విశ్లేషణ - అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

ఓటలాండ్ గొంతుక - జెన్సెన్ - సి.ఎల్.ఎల్. జయప్రద

కృష్ణ బిలం - సి. వి. సర్వేశ్వర శర్మ

మహాభారతం- రామాయణం - డా॥ పెదపాటి నాగేశ్వరరావు

వేదార్థ సారం - శివలింగం

విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **విజయుడైన బాకస్**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd.,
1-1-60/5, R.T.C. X Roads, Musheerabad, Hyd - 20. Ph. 7645536
E-mail : misimi_m@hotmail.com
http : //www.misimi.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# ARE YOU YOUNG AT HEART?

You may be on the wrong side of the generation gap, but are you young at heart? Or are you an old fuddy duddy before your time? Try our quiz to find out.

1. Your children are having a party. Do you :
a. leave them to it
b. have your own party in the kitchen
d. dance with the youngsters all night

2. You go shopping for a new outfit. Is it :
a. a bigger version of what your son/daughter loves to wear
b. something your son/daughter wouldn't be seen dead in
c. flattering, and something your son/daughter might like to borrow

3. What kind of car would you like to drive?
a. a comfortable saloon
b. an off-road vehicle
c. a natty sports car

4. Your partner suggests a romantic weekend away. Do you :
a. confess that you're already booked in to go clubbing in Bangkok with your mates
b. say, "Why? We've got a family holiday coming up"
c. agree that it would be fun to get away

5. What do you think of modern art?
a. load of rubbish
b. interesting
c. the only art worth looking at

6. Your daughter begs you to take her to see the Spice Girls. Do you:
a. groan inwardly, but take her
b. jump into your trendiest outfit and go prepared to boogie
c. refuse to go, but buy her the CD to make up

7. How are you fixed when it comes to information technology ?
a. hopeless – you can't even use a word processor
b. kitted out with all the latest gear
c. reasonably competent

8. How often do you take energetic exercise?
a. three times a week or more
b. about once a week
c. never

9. Your children are watching the chart show on television. Are you:
a. on the sofa with them
b. in the kitchen
c. thinking, "what's chart show?"

10. Your daughter has broken up with her first proper boyfriend and is crying her heart out. Do you :
a. tell her not to be so silly, there's no such things as love at her age
b. throw your arms round her and have a good cry together
c. sympathise, at the same time trying to provide distraction.

NOW CALCULATE YOUR SCORE

| | a | b | c |
|---|---|---|---|
| 1. | 0 | 5 | 10 |
| 2. | 10 | 0 | 5 |
| 3. | 0 | 5 | 10 |

*Continued on Page : 260*

# ఫానన్ వాదం : FANONISM

- బి. తిరుపతిరావు

ఫానన్‌వాదం : (Fanonism) : మార్టినిక్‌కు చెందిన మనో వైజ్ఞానిక వేత్త, విప్లవకారుడు ఫ్రాంజ్ ఫానన్ (Frantz Fanon) (1925 - 1961). వలసవాదం గురించి చేసిన ప్రతి పాదనలు ఫాననిజంగా ప్రచారమయ్యాయి. ఒకరకంగా ఈపదం 1950ల తరువాత జరుగుతూ వున్న వలస వాద వ్యతిరేక వుద్యమాలలలో ప్రముఖంగా విన్పిస్తుంది. ఒక దశలో ఫానన్ మూడవ ప్రపంచ దేశాల్లోని వలసవాద వ్యతిరేక ఉద్యమాల ప్రవక్తగా, 'Romantic Hero' గా గుర్తింపు పొందాడు. ఫానన్ రచనలు క్రమంగా ఆయన్ని అల్జీరియా విముక్తి ఉద్యమాల్లో పాల్గొనేటట్లు చేశాయి. వలస వాదం, జాతి వివక్షతల గురించి మౌలిక రచనలు చేసిన ఫానన్ 'Black Skim, White Masks', 'The wretched of the Earth' అనే రెండు పుస్తకాలవల్ల విశేష ప్రాచుర్యాన్ని పొందాడు.

ఫానన్ వృత్తి పరంగా మానసిక రుగ్మతల్ని పరిశీలించే డాక్టరు కావటం వల్ల ఆ జ్ఞాన సహాయంతో వలస ఆధిపత్యాన్ని, వలసల్లోని ప్రజల మానసికస్థితిని విశ్లేషించగలిగాడు. 1953 నుండి అల్జీరియాలో వైద్య వృత్తిలో వున్న ఫానన్ అక్కడి వైద్యశాలల్లో ఫ్రెంచి డాక్టర్లు అల్జీరియన్ రోగుల్ని అమానుషంగా చూడటానికి నిరసనగా ఉద్యోగం నుండి 1956లో వైదొలిగాడు. 1957లో అల్జీరియా నుంచి బహిష్కరింపబడి టూనిసియాలో వుంటూ అల్జీరియా జాతి విముక్తి కోసం స్థాపించబడిన 'జాతి విముక్తి సంఘటన' కోసం పని చేశాడు. ఆ అనుభవంతోనే 'The Dying Colonalism' అనే పుస్తకం రాశాడు.

ఫానన్ తన మొదటి రచన 'Black Skin, White Masks' లో వలసాధిపత్య స్వభావాన్ని, జాతి వివక్షత మనస్తత్వాన్ని విశ్లేషించాడు. 'The wretched of the Earth' లో మూడవ ప్రపంచ దేశాల రాజకీయ పరిణామాల్ని, ముఖ్యంగా అల్జీరియా, ఆఫ్రికా పరిణామాల్ని విశ్లేషించాడు. హింస ప్రాతిపదికగా వుండే ఒకానొక విముక్తి సిద్ధాంతాన్ని ఈ రచనలోనే ప్రతిపాదించాడు. హింస అనేది మొత్తం వలసవాద పథకాన్ని ఆవరించి వుందని, వలస వాదానికి గురవతున్న ప్రజలు తమతమ వలస వారసత్వాల నుండి, ఆత్మన్యూనత భావం నుండి బయటపడి చేసే ప్రతిహింస వల్ల మాత్రమే వలస వాదం నుండి విముక్తి పొందటం సాధ్యమవుతుందని, అసలు ప్రతిహింస వల్ల కూడా ఆత్మన్యూనత భావం పోతుందని ప్రకటించాడు. ప్రతి హింస స్థానికుల్ని ఆత్మన్యూనత నుంచి బయట పడవేయటమే కాక వలసల్లోని ప్రజల్లో గొప్ప ఆత్మ విశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తుందని భావించాడు ఫానన్.

---

శ్రీ బి. తిరుపతిరావు, విజయవాడ, సిద్ధార్థ ఆర్ట్సు & సైన్సు కళాశాలలో ఆంగ్లశాఖలో ఉపన్యాసకులుగా పనిచేస్తున్నారు.

శ్వేత జాతీయులు భావ జాలాల్ని నరనరాన జీర్ణించుకుని నల్ల జాతీయుల్ని చాలా ప్రమాదకరమైన వర్గంగా చూశాడు ఫానన్. ప్రజల, ప్రజా విలువల ప్రాతిపదికగా సమాజ పునర్ నిర్మాణంలో ప్రాంతీయ మేధావులు పని చేయాలని నిరంతరం ప్రవచిస్తూ వచ్చాడు ఫానన్. జాతీయ వాదాన్ని కూడా ఫానన్ గ్రుడ్డిగా చూడలేదు, విమర్శనాత్మకంగా చూశాడు. ఎడ్వర్డ్ సైద్ మాటల్లో చెప్పాలంటే ఫానన్ ముందుకు తీసుకు వచ్చింది విమర్శనాత్మక జాతీయవాదం (critical nationalism). వలసలుగా మారిన దేశాలు అలా మారటానికి ముందు సమ జాతీయంగాను, సర్వాంగ సుందరంగానూ వున్నాయనే భ్రమలో ఫానన్ ఎప్పుడూ లేడు. ప్రతి సమాజమూ మౌలిక మార్పుల్ని కోరుకొంటూ వున్నాయని భావించాడు. జాతీయవాదం అనేది విజయవంతం అవుతున్న క్రమంలో సామాజిక చైతన్యంగా మార్చబడక పోయినట్లయితే అది విముక్తికి గాక సామ్రాజ్య వాదానికి మాత్రమే దారి తీస్తుందని భావించాడు ఫానన్.

శరీర, మానసిక వికాసాలకి సంబంధించిన జాతి వివక్షతతో కూడుకున్న సిద్ధాంతాల మీద తీవ్ర దాడి చేశాడు ఫానన్. వలస వాదం వలసల్లోని ప్రజల మనస్సుల్ని విధ్వంసానికి గురి చేశాయని, ఫలితంగా వలసల్లోని ప్రజలు తమ కళ్ళ ముందు ఏమి జరుగుతుందో కూడా గ్రహించలేని స్థితికి నెట్టి వేయబడ్డారని ప్రకటించాడు ఫానన్. వలసలోని వ్యక్తి అస్తిత్వాన్ని, అసలు మనిషి సారాన్ని అంతం చేస్తుందని, అసలు నల్ల జాతికి చెందిన మనుష్యులు, మనుష్యులుగా కాకుండా వస్తువులుగా మార్చబడ్డారని, ఈ స్థితిలో అహం (self) అనే దానికి అర్థం లేకుండా పోయిందంటాడు ఫానన్. మానసిక విభిన్నతల్ని జాతి కేంద్రంగా విశ్లేషించిన వలస వాదం అంతిమంగా నల్ల జాతి విషయిని (black subject) శూన్యంగా చూసిందంటాడు ఫానన్.

వలస వాదం గురించిన ఫానన్ ప్రతిపాదనలు మూడవ ప్రపంచ దేశాల్లో గొప్ప ప్రేరణగా నిలిచాయి.

*Continuation from Page No. 258*

| | | | |
|---|---|---|---|
| 4. | 10 | 0 | 5 |
| 5. | 0 | 5 | 10 |
| 6. | 5 | 10 | 0 |
| 7. | 0 | 10 | 0 |
| 8. | 10 | 5 | 0 |
| 9. | 10 | 5 | 0 |
| 10. | 0 | 10 | 5 |

70-100 : You are so young at heart it's a surprise that you're not still at school. You only feel at home among young people or adults like yourself. This sounds like fun, but beware. Youngsters sometimes get fed up with adults, no matter how young at heart they are. You may (gulp) need to grow up.

40-65 : You are the perfect combination of acting your age and enjoying it, while still being able to empathise with young people. You manage to enjoy life and all it has to offer, but you are happy to keep the generation gap where it belongs.

Don't change.

0-35 : You are old before your time. It's no wonder if you've got a reputation for being a real old grump. Try to lighten up a little and enjoy feeling free, healthy and fun loving. Life will definitely improve if you allow your inner child to play a little.

*– Asia Features.*

# రావిశాస్త్రి 'అల్పజీవి' : మనోవిశ్లేషణ

- అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

ఒకసారి ''తెలుగులో కలకాలం నిలిచే నవలలు ఏవి?'' అనే మీమాంస తలెత్తింది. దానికి సమాధానంగా ఆచంటి జానకిరామ్ ఉన్నవ వారి 'మాలపల్లి', విశ్వనాథ 'ఏకవీర', గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర', బుచ్చిబాబు 'చివరకు మిగిలేది', జి.వి. కృష్ణరావు 'కీలు బొమ్మలు', రావిశాస్త్రి 'అల్పజీవి' అని తేల్చారు. నిజంగా ఇవన్నీ తెలుగులో కలకాలం నిలిచే నవలలే. నన్నడిగితే, వీటికి తోడు చలం 'దైవ మిచ్చిన భార్య', వీరేశలింగం 'రాజశేఖర చరిత్రము', కొడవటిగంటి 'చదువు', నోరివారి 'రుద్రమదేవి', శ్రీదేవి 'కాలాతీత వ్యక్తులు'ను చేరుస్తాను.

'అల్ప జీవి' కలకాలం నిలిచే నవల అనడంలో అనౌచిత్యం ఏమీ లేదు. ఏ నవల అయినా మనిషి అంతరాంతరాలను, గర్భకుహరాన్ని ఆవిష్కరిస్తే అది కలకాలం నిలుస్తుంది. మానవుని గర్భకుహరం మానవ స్వభావాన్ని, సంస్కృతీ లోతులను ప్రతిబింబిస్తుంది. అవి అంత తొందరగా మారవు. అందుకని అటువంటి నవలలు కలకాలం నిలుస్తాయి. తన నవలకు రావి శాస్త్రి 'అల్పజీవి' అనే పేరును తానుగా పెట్టలేదు. అది 1953లో ధారావాహికంగా 'భారతి'లో వస్తున్నప్పుడు దాని సంపాదక వర్గ సభ్యుడు కె. సంత్యనారాయణ పెట్టినపేరు. ఈ సంగతి రావిశాస్త్రే తన 'ఆఖర్నోమాట'లో చెప్పుకొన్నాడు. కాని ఈయన నవలాను శీలనం చేసి, డ్యాక్టరేట్ అందుకొన్న గ్రంథంలో ఏమో, భారతి సంపాదక వర్గంలోని వి.డి. ప్రసాదరావు ఆ పేరు పెట్టాడంటాడు. ఏది ఏమైనా ఈ నవలకు రావిశాస్త్రి మొదట పెట్టిన పేరు 'అయ్యారే బాబారే!

ఏ యుగమైనా, తన స్పిరిట్‌ని తన కళా సాహితీ రూపాలలోకి ప్రక్షేపిస్తుంది. అంటే ఆ యుగంలో, ఆకాలంలో లేచే భావతరంగాలను, ఉద్యమాల హోరును, తత్వ వీచికలను పుణికి పుచ్చుకొని కవులు, కళాకారులు తమ తమ కృతులలో ప్రతి బింబిస్తారు. అయితే అందరూ వాటిని ఒకే విధంగా ప్రతి బింబించరు. కవులు, రచయితలు ముందుగా వ్యక్తులో **(individuals)**, మూర్తులు **(persons)**. అందుకని వారి దర్శనాలు **(perceptions)** వేరుగా ఉంటాయి. అలాగే వారు ఆత్మాభివ్యక్తీకరణం **(self expression)** చేసుకొంటారు. అందుకని సమాజం - వ్యక్తి - ఆత్మాభివ్యక్తీకరణం - ఈ మూడింటి సంబంధాన్ని దృష్టిలో ఉంచుకొని ఏ రచనైనా పరిశీలించాలి, అర్థం చేసుకోవాలి. అవగాహన చేసుకోవాలి.

1950లకు ముందు సాహిత్యంలో వచ్చిన తిరుగుబాటు, దానితో పాటు పెల్లుబికిన హేతువాద ఉద్యమం, సంప్రదాయ శృంఖలాలలో ఇరుక్కోని వారిని బాగా ఆకర్షించాయి. ఈ యువకుల మీద బౌద్ధం, రసెల్, మార్క్స్, రాయ్, ఫ్రాయిడ్, ఆడ్లర్, యూంగ్‌ల ప్రభావం పడింది. ఇలాంటి ప్రభావాలకు లోనై నవలలు నిర్మించిన వారిలో జి.వి. కృష్ణరావు, గోపీచంద్, బుచ్చిబాబు, రావిశాస్త్రి ముఖ్యులు. వీరిలో ఎవరి దృక్పథం వారికి ఉన్నా, ఎవరి తత్వం వారికి ఉన్నా మొత్తం మీద వీరు తెలుగు నవలకు ఒక పరిణత రూపాన్ని 1960లకు ముందే కల్పించారు.

అల్పజీవి నిస్సందేహంగా ఒక మనోవైజ్ఞానిక నవల. మనోవైజ్ఞానిక సిద్ధాంతాల ప్రభావానికి అద్దం పట్టే నవలను మనోవైజ్ఞానిక నవల అనవచ్చు. ఒక రచయిత ఫ్రాయిడ్, ఆడ్లర్, యూంగ్‌ల సిద్ధాంతాలను చదివి ఉండవచ్చు, ఉండక పోవచ్చు. ముఖ్య విషయం ఏమంటే వారి సిద్ధాంతాల తాలూకు ప్రతిధ్వని నవలలో కన్పించడం. ఫ్రాయిడ్ చెప్పిన జీవమరణ సహజాతాలు, లెబీడో, ఈడిపస్ కాంప్లెక్స్, స్వప్న రహస్యం, చైతన్య స్రవంతి, రక్షణ యంత్రాంగం **(defence mechanisms)** స్వేచ్ఛా సంసర్గం **(Free association)** సిద్ధాంతాలూ, ఆడ్లర్ చెప్పిన న్యూనతా భావ గ్రంథి **(inferiority complex)**, జీవిన శైలి **(Life style)**, పురుషోద్ధతి **(Masculine Protest)** సిద్ధాంతాలూ, యూంగ్ చెప్పిన మూల రూపాలు **(Archi types)**, అంతర్ముఖ **(introvert)**, బహిర్ముఖ **(Extrovert)**, ఛాయ **(Persons)**, యానిమ్ (పురుషునిలో ఉండే స్త్రీ అంశ), యానిమస్ (స్త్రీలో ఉండే పురుష అంశ) సిద్ధాంతాలూ ఏదో విధంగా, బహిరంగంగా గాని, నర్మగర్భంగా గాని, ఒక నవల ప్రతిబింబిస్తే అది మనోవైజ్ఞానిక నవల అని నిస్సందేహంగా చెప్పవచ్చు. మనస్సు చరించే తీరును, దాని చిత్రగతులను వర్ణించే లేదా వ్యక్తి మూర్తిమత్వాన్ని **(personality)** కేంద్రంగా చేసుకొని రచించే నవలను మనోవైజ్ఞానిక నవల అనవచ్చు.

1950లకు ముందే ఫ్రాయిడ్, ఆడ్లర్, యూంగ్‌ల సిద్ధాంతాలు ప్రపంచమంతటా విపులంగా ప్రచలితం కావడంతో అవి తెలుగు గడ్డను గూడా సోకాయి. తెలుగు నవలా కారులనూ ఆకర్షించాయి. 1953లో వచ్చిన అల్పజీవి ఆ సిద్ధాంతాలను ప్రతిబింబించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు.

మరి అల్పజీవిలో అంతర్గితంగా ఉన్న మనోవైజ్ఞానిక సిద్ధాంతం ఏమిటి? లేదా సిద్ధాంతాలు ఏమిటి? ఈ ప్రశ్నకు సమాధానం నవల చదివే వాని మీద ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే ఏ నవల గూడ నిర్ద్వంద్వంగా, స్పష్టంగా, అసంధిగ్ధంగా, శాస్త్రంలా ఉండదు, ఉండరాదు. అలా శాస్త్రంలాగో, గణితంలాగో ఉంటే అది నవల కాదు. మేఘాలలోకి చూసినప్పుడు, చూసే వానిని బట్టి అక్కడ పులో, గడ్డం తాతో కనిపిస్తాడు. అలాగే నవల గూడ, కొంతమేరకు మేఘంలా ఉండి, పాఠకుని మనస్సు అందులోకి చొచ్చుకొనిపోయి తనకు కావలసింది వెతుక్కోవడానికి వీలుగా ఉండాలి. ఇది మంచి నవల లక్షణం. అందుకని ఇంతకు ముందు వేసుకొన్న ప్రశ్నలకు సమాధానాలు చూద్దాం.

''ఈ నవల న్యూనతాభావ గ్రంథి **(inferiority complex)** ఆధారంగా రాయబడింది'' అని అధికుల అభిప్రాయం. ఇది చాల వరకు సబబే. అయితే అది కేవలం ఆ ఏక సిద్ధాంతం మీదే ఆధారపడి రాయబడిందా? అంటే చెప్పలేం.

ఎలాగంటే, ఆలోచన రెండు విధాలుగా ఉంటుందని తర్కం చెబుతుంది. ఒకటి తార్కికాలోచన. రెండోది అనియంత్రిత ఆకిస్మిక, యాదృచ్ఛికతాలోచన. దీనిని 'రాండమ్ తింకింగ్' అంటారు. రావిశాస్త్రి ఆంధ్రవిశ్వ విద్యాలయంలో తత్వశాస్త్రం చేశాడు గనుక, తత్వశాస్త్రంలో తర్కం ఒక అవశ్యక పాఠ్యాంశం కనుక, ఆ తర్కంలో మిసెస్ నికొలస్ నికలబీ 'రాండమ్ తింకింగ్'ను గురించి రావిశాస్త్రి చదివాడు. అల్ప జీవి నాయకుడైన సుబ్బయ్య ఆలోచన అనేక సందర్భాలలో అనియంత్రితమే.

మరికొంతమంది విమర్శకులు సుబ్బయ్య అస్తిత్వపు లోతులకు వెళ్ళి పోయాడన్నారు. తన ఉనికికీ, అస్తిత్వానికీ అనుక్షణం అర్థం చెప్పుకోవడానికి విఫల ప్రయత్నం చేశాడన్నారు.

రావి శాస్త్రేమో తన మీద జేమ్స్‌జాయిస్, శ్రీశ్రీ 'కోనేటి రావు' పాత్రల ప్రభావం పడిందని చెప్పుకొన్నాడు. కాని దీనితో మనం ఏకీభవించలేం. మనమే కాదు ప్రఖ్యాత సాహిత్య విమర్శకుడు సుదర్శనం గూడ ఏకీభవించడు. ''జేమ్స్ జాయిస్, వర్జీనియా ఉల్ఫ్‌ల చైతన్య స్రవంతి **(Stream of consciousness)** పద్ధతిలో ఈ నవల నడిచింది,'' అని చెప్పిన చాలమంది అపోహలో ఉన్నారన్నాడు సుదర్శనం. ఇది నిజమే ఎందుకంటే నవలలో జేమ్స్ జాయిస్ ఉలిసీస్‌లో ఉన్నట్లుగా 'కామా, ఫుల్‌స్టాప్‌లు లేని నలభైనాలుగు పేజీలు నింపిన ఏక వాక్యం లేదు. అచేతనంలో బయలు దేరి, చేతనంలోకి వచ్చేటప్పటికి రూపొందీ రూపొందని ''పదాలు'' ఈ నవలలో లేవు. చైతన్య స్రవంతిలో 'అర్థంకాని తనం' ఉంటుంది. అది మనకు ఈ నవలలో కనపడదు.

ఇంకొంతమంది దీనిని 'ఆంతరిక సంభాషణలు' **(interior monologues)**, ఒక 'అంతర్మథనం' అన్నారు. సుబ్బయ్య తనలోతానే, ''అలాకాదు ఇలా; అలా అనకుండా ఇలా అంటే బాగుండేది; ఇలా చేస్తే బాంగుండేది, ఇలా చేయక పోవడమే మంచిదైంది,'' అని అనుకొంటూ తనకు వ్యతిరేకంగాను తనకు అనుకూలంగాను లోలోపలే వాదించు కొంటాడు.

ఎందరు ఏమి చెప్పినా 'అల్పజీవి' నవలను న్యూనతాభావ గ్రంథి **(inferiority complex)** కోణం నుంచి పరిశీలిస్తే బాగుంటుందనిపిస్తుంది. ఎవరు ఆ నవలకు ఆపేరు పెట్టినా, అది చాల అతికినట్లు కనిపిస్తుంది. పుట్టినప్పుడు ప్రతి ఒక్కడూ అల్పుడే, శారీరకంగా, మానసికంగా, శక్తిపరంగా, అన్నిటిల్లోను పెద్ద వాళ్ళతో పోల్చినప్పుడు పిల్లలు అల్పులే. అందుకని ప్రతి పిల్లవాని జీవితం న్యూనతా భావనతోనే ఆరంభమవుతుంది. అయితే పిల్లవాడు ఎదుగడంలో, - సామాజిక కారకాల దోహదంతో అంటే తల్లి తండ్రి, ఇరుగు పొరుగు, సమవయస్కులు, గురువులు కల్పించే దోహదంతో- ఆ న్యూనతా భావనను అధిగమిస్తాడు. ఈ ఎదుగుదలలో చాల మందికి విజయమే చేకూరుతుంది. కొంత మంది, సుబ్బయ్యలాంటి వారు, కొన్ని చిన్ననాటి అనుభవాలతో కుంఠితులై, అక్కడే స్థిరీభవని చెందుతారు. దీనిని ఫిక్షేషన్ అంటాడు. న్యూనతనుంచి ఆధిక్యతకు చేసే పయనాన్ని ''నష్టపూరణం'' **(compensation)** అంటాడు ఆడ్లర్. ఈ ఆధిక్యతకు ఈ పయనంలో ప్రతి వ్యక్తి తనదైన విధానాన్ని 'శైలి' ని అనుసరిస్తాడు. దీనినే ఆడ్లర్ ''జీవినాశైలి'' **(life style)** అన్నాడు. సమస్యల పరిష్కారానికి వ్యక్తి అనుసరించే పరిష్కార విధానమే జీవనశైలి.

సుబ్బయ్య తన సమస్యలకు పరిష్కారాన్ని కనుగొనడంలో అవలంబించే 'శైలి' ని చూస్తే సుబ్బయ్య మనస్తత్వం అర్థమవుతుంది.

సుబ్బయ్య రెండు కారకాలతో బాధితుడయ్యాడు. ఒకటి భయం, రెండోది న్యూనత. ఈ రెండింటిని అధిగమించడానికి విజయవంతమైన 'జీవన శైలి' అనుసరించలేకపోయాడు.

ఏ విజయవంతమైన 'జీవనశైలి' అయినా చాలవరకు సామాజిక కారకాల మీద అంటే **(Social factors)** మీద ఆధారపడి ఉంటుంది. పాపం సుబ్బయ్య విషయంలో అవి అతనికి దోహదపడ లేదు.

తల్లి బాల్యంలోనే పోయింది. తల్లి ఏ బిడ్డకైనా పరమాధారం. అది లేని అతని బ్రతుకు గాలిలో తేలియాడుతూ, దేని మీద కాలూన లేనిది అయింది. అంటే అతడు ఒకరకమైన, కారణం తెలియని, ప్లవన వ్యాకులత **(Floating anxiety)** తో బాధితుడయ్యాడు. రెండోది తన చిన్నతనంలో తండ్రితో చీకట్లో వెళ్తుంటే, తనను దూరంగా నెట్టి వేసి తండ్రిని ఇద్దరు ముగ్గురు కొట్టిన జ్ఞాపకం, అతనిని ఎప్పుడు మసక మసకగా వెన్నాడుతూనే ఉంది. ఆ అనుభవం తాలూకు ఛాయలు అతని అచేతనంలో పాతుకు పోయాయి. ఫ్రాయిడ్ భాషలో చెప్పాలంటే అతడక్కడే స్థిరీభవనం చెందాడు.

మూడోది సుబ్బయ్య సవతి తల్లి క్రూరత్వం అగ్నికి ఆజ్యమైంది. ఈ మూడు సుబ్బయ్య 'జీవన శైలి' 'మూర్తిమత్వ' లక్షణాలయ్యాయి. ఈ 'జీవనశైలి' లో ఉన్న సుబ్బయ్య జీవిత చిత్రణమే ఈ నవల.

ఎవరైన తనలో లేని మంచి వాటిని ఇతరులలో ఊహించుకొని, వారితో తాధాత్మ్యం చెంది, ఒక రకమైన ప్రాతినిధ్య సుఖాన్ని అనుభవిస్తారు. అలాగే మన నాయకుడు సుబ్బయ్య గూడ ఎర్ర చీర మనిషిని, మునీశ్వర్ల వారిని, రెండు లేడిపిల్లలను ఊహించుకొంటాడు. వీరంతా అతని ఊహలకు ప్రతీకలు. వీరందరూ అతనిలో నిర్ధాణంగా ఉన్న ప్రేమ, శాంతి, స్త్రీ వాంఛ, చీకూచింతలేని హాయి అయిన జీవితాలను ప్రతిబింబిస్తారు.

సుబ్బయ్యలోని మూడు ఉద్వేగాలను వెంకట్రావు, గవరయ్య, మనోరమలు ప్రతీకికరిస్తారు. వెంకట్రావు ధనాశకు, గవరయ్య లోభి తనానికి, మనోరమ కామానికి ప్రతీకలు. నవల వీటి చుట్టూ అల్లుకునే నడుస్తుంది.

సుబ్బయ్య తన న్యూనతాభావ గ్రంధి నుంచి కొంతగాక పోయినా కొంతగానైనా బయట పడడానికి బావమరిది వెంకట్రావు, గవరయ్య నౌకరు పోతన్న, ఆఫీసు గుమస్తా అవధాని, మనోరమలు ప్రోత్సహిస్తారు.

ఈ నవలలో కథ పెద్దగా లేదు అంతా సుబ్బయ్య పాత్ర చిత్రణే. సుబ్బయ్య నంగిరి పింగిరిగాడు. వట్టి వజమ్మ, చవట, అసమర్థుడు. తాను చెప్పాలనుకొంది చెప్పలేని, చేయాలను కొంది చేయలేని అసమర్థుడు. ఒకటి చెప్తాడు, ఒకటి చేస్తాడు. తరవాత ''అలా చెప్పి ఉండవలసింది కాదు, అలా చేసి ఉండవలసింది కాదు'' అనుకొంటాడు. అవతలి వాని ఉద్దేశం ''ఇదైఉంటుంది, కాదు అదైఉంటుంది'' ఇలా విరోధాలతో ఆలోచిస్తుంటాడు. అతని మనస్సు అతనికి వాస్తవం, దానిని బాహ్య ప్రపంచానికి ఆరోపిస్తాడు. అందుకని సుబ్బయ్య ప్రపంచాన్ని సరిగా అర్థం చేసుకోలేడు. అతని మనో వల్మీకం

ఒకసాలెగూడు. ఆ గూట్లో అతడు ఇరుక్కు పోయాడు. ఆ గూటి లక్షణం అతని ఆత్మన్యూనతా భావం. సుబ్బయ్య లంచం పుచ్చుకొన్నాడు: ''ఇంకా ప్రక్కకి, ఇంకా వెనక్కి, ఇంకా వారకి, ఇంకా చాటుకు పోతాం తప్పుకు పోవాలి. ఎవరెలా ధీమాగా నడుస్తున్నారు? ఎంత ధీమాగా నడుపిస్తున్నారు! నేను గూడ ధీమాగా, ధైర్యంగా ఉండ గలిగితే -'' అనుకొంటాడు సుబ్బయ్య లంచం తీసుకొన్నాక. లంచం పుచ్చుకొనేముందు ఊగిసలాట. తెల్ల చీర మనిషి టైమ్ అగినప్పుడు తడబాటు. గవరయ్య బాకీ అడిగి తెమ్మన్నాడని పోతరాజు సుబ్బయ్య దగ్గరకు వచ్చి చెబుతాడు. సుబ్బయ్య 'తాను ఇవ్వను', అని చెప్పడం అసంభవమని భావిస్తాడు. అసంభవమని భావించిన దానిని సంభవం చేశాడు. హామ్లెట్ అనుకోకుండ, యాదృచ్ఛికంగా పిన తండ్రిని చంపినట్లు సుబ్బయ్యకు అనుమానం'', అలా చెప్పింది తనేనా'' అని. ''నేనే, నానోటితోనే చెప్పాను'' అనుకొంటాడు. ఇవన్నీ అతని ఆత్మన్యూనతను ప్రదర్శించే సంఘటనలే. ఇంకా నవల నిండా ఇలాంటి సందార్భాలెన్నో ఉన్నాయి.

గవరయ్యను సుబ్బయ్య దిక్కరించడం, మనోరమ కౌగిలి, లాలింపులు, వెంకట్రావు, మనోరమలు, సుబ్బయ్య - గవరయ్యకు రాసిన ప్రోనోటును తిరిగి తెప్పించడం లాంటి సందర్భాలు సుబ్బయ్య జీవనశైలి కొంత వరకైనా మారడానికి తోడ్పడ్డాయి.

సుబ్బయ్య ఈ కథకు నాయకుడు, ఊహ తెలియకముందే తల్లి మరణం. సవతి తల్లి క్రౌర్యం. తండ్రిని చీకట్లో ఎవరో కొట్టడం. సుబ్బయ్యకు గుమస్తాగిరి రావడం. క్లాసుమేట్ వెంకట్రావు చెల్లెలు సావిత్రిని సుబ్బయ్యకు పెళ్ళి చేయడం. సావిత్రి సుబ్బయ్యను అసలు మగనిగానే చూడక పోవడం. వెంకట్రావు అవసరానికి, సుబ్బయ్య గవరయ్య దగ్గర ఐదు వందలు లంచం తీసుకోవడం, సీటు మారడం వల్ల గవరయ్య పని చేయ లేక పోవడం, గవరయ్య బెదిరించి నోటు రాయించుకోవడం, అనుకోకుండ మనోరమ అతని జీవితంలోకి ప్రవేశించడం, వెంకట్రావు, మనోరమల జోక్యంతో నోటును వెనక్కు తెప్పించడం, మనోరమ లాలన - ఇవీ ఈ నవలలోని ముఖ్యాంశాలు. ఈ అంశాలతో కథను బ్రహ్మాండంగా నిడిపించాడు రావిశాస్త్రి. కథ బిగికంటె సుబ్బయ్య అంతర్మధనాన్ని చిత్రించిన తీరు - ఒక చైతన్య ధార, సుప్త చైతన్యంతో ప్రభావితమైన భావధార - మహాద్భుతంగా ఉంది. ఈ నవలను ఎవరైన అందుకే అభిమానించవచ్చు. మరిదేనికీ కాదు. చేతనా చేతనల మేళవింపు, భూత భవిష్య ద్వర్తమానాలు సుబ్బయ్య ఆలోచనలో అంతర్గతంగా కలగా పులగం కావడం - వీటిని అద్భుతంగా ప్రదర్శించారు రావిశాస్త్రి.

''మంచి, పిరికి ఒక చోటు మన లేవు. ఏది మంచికి హాని కలిగిస్తుందో, ఏది చెడ్డకు ఉపకారం చేస్తుందో, రచయిత ఆలోచించి రాయాలంటాడు శాస్త్రి. పిరికివాడు మంచి వాడు కాలేడు. మంచిగా ఉండాలంటే ధైర్యం కావాలి. నేను రాసేదంతా అందుకే'' అంటాడు రావిశాస్త్రి. సుబ్బయ్య పిరికి తనం కొంత మేర తగ్గింది. మరి అతడు మంచి వాడయ్యాడా? తెలుసుకోవడానికి అల్పజీవిని అడగండి.

(ఆలిండియా రేడియో, విజయవాడ వారి సౌజన్యంతో)

# ఓటలాండ్ గొంతుక - జెన్సెన్

## (*1945* నోబెల్ సాహిత్య బహుమతి పురస్కారోపన్యాసము)

మూలం : జొహానస్ వి. జెన్సెన్ అనువాదం : సి.ఎల్.ఎల్. జయప్రద

ఈ నోబెల్ పురస్కారమిచ్చి నన్ను గౌరవించిన గౌరవనీయులైన స్వీడిష్ అకాడెమీకి, స్వీడన్ దేశానికి నేను కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. ప్రస్తుతం మనందరి మనస్సుల్లో మెదలుతున్న వారు ఈ బహుమతి వ్యవస్థాపకులు, ఆల్ఫ్రెడ్ నోబెల్. వారి దాతృత్వం వలన ఈ రోజు ప్రపంచంలో సైన్సుకి, సాహిత్యానికి, శాంతి వ్యవస్థాపనకు ఎంతో మేలు జరిగింది. ఈ గొప్ప స్వీడిష్ శాస్త్రవేత్త, మానవతా వాది స్వీడన్ పేరుని దేశాల ఎల్లలని దాటి అన్ని దేశాలను ఒక దాని కొకటి దగ్గరగా చేర్చే విశాల దృక్పదంతో సంయోజించారు.

స్వీడన్‌లోని అంతర్జాతీయ ఖ్యాతిగల మహనీయులను తలచుకోగానే మనకి గుర్తు వచ్చేది ఆల్ఫ్రెడ్‌నోబెల్‌కు ముందు కాలంలో జీవించిన జీవశాస్త్రవేత్త, మహా మేధావి లెనీ. ఈయన జంతువులన్నిటికీ సరైన పేర్లు నిర్ణయించి, పరిణామ సిద్ధాంతం గురించి ఎవరూ ఊహల్లోనైనా ఆలోచించక ముందే మానవులు, కోతులు ఒకే జాతికి చెందిన వారని కనుగొన్నాడు. లెనీ ప్రతిభాశక్తికి మూలమైనవి ప్రకృతి పట్ల గాఢమైన ప్రేమ, చలించే, శ్వాసించే జీవులన్నిటిపైనా మమకారం. పరిణామ క్రమం గురించిగానీ, సహజ శాస్త్రాల గురించి గానీ చరిత్రపైగానీ ఏ భాషలో పుస్తకం తెరిచినా మనకు కన్పించేది లెనీ పేరే. తరతరాలుగా అందరి మనస్సుల్లో స్వీడన్ పర్వతాలతో స్వీడన్ ప్రజలు ప్రకృతిలో ఆనందించే తత్వంతో ముడిపడి ఉన్న లక్షణాలు ఆలోచనల్లో కొత్తదనం, జీవితాన్ని తేలిగ్గా తీసుకునే ధైర్యం లెనీలో చోటు చేసుకున్నాయి.

గొప్ప శాస్త్ర వేత్తగా, అతి దయార్ద్ర హృదయుడై అందరి ప్రేమ చూరగొన్న వ్యక్తిగా, రెండు శకాల మధ్య గీత గీసిన మహాశక్తిగా, మనపూర్వీకులలో అత్యంత గొప్పవాడిగా పేరుగాంచిన చార్లెస్ డార్విన్ గురించి తలచుకోకుండా నేనీరోజు లెనీ గురించి మాట్లాడలేను. ఆయనకి పరిణామ సిద్ధాంతం జీవిత కాలపు పరిశోధనకు వస్తువు మాత్రమే కాదు. ఆయన సమస్త జీవన సారం, ప్రతి రోజూ కళ్ళకి కన్పించి, మనుసుని అలరించే ప్రకృతిలోని వైభవానికి, అద్భుతాలకి ఒకరుజువు.

ఒక దేశం యొక్క మానసిక పరిపక్వత ఆ దేశం యొక్క తర్కించే శక్తి, అవగాహన చేసుకునే శక్తి ఆధారంగా కొలిస్తే ఇంగ్లండు తన యధార్థ వాద బలంపై ప్రథమ శ్రేణిలో నిలుస్తుంది. దానికి కారణమైన మహనీయుడు తన ఆలోచనలను సూటిగా సులభమైన భాషలో వ్యక్తీకరించిన డార్విన్.

లెనీ ప్రతిపాదించిన జాతులకు సంబంధించిన సిద్ధాంతాలే తరువాత డార్విన్ పరిణామక్రమ సిద్ధాంతం ప్రతిపాదించటానికి దోహదం చేశాయి. ఆంగ్లేయులు, స్వీడిష్ వారిరువురూ తమ తాతల నాటి నార్డిక్ నేపథ్యం నుండి పొందిన యధార్థ దృష్టి, ప్రకృతిలో మానవ జాతి స్థానం నిర్దిష్టంగా కలకాలం నిలచేలా ప్రతిపాదింప చేసింది.

---

శ్రీమతి సి.ఎల్.ఎల్. జయప్రద, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో
ఆంగ్ల శాఖలో, ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

ఈ సందర్భంలో నేను స్వీడిష్ సాంప్రదాయంతో అనుబంధం గల ఒక డేనిష్ సాహితీవేత్త ఆడమ్ ఓలెన్ష్లేగర్‌ని గుర్తు చేసుకోవాలి. స్వీడిష్ రాష్ట్ర కవి వాసియాన్‌టేగనర్ ఆయన్ని 1829లో లండన్‌లో కలుసుకున్నప్పుడు ''మహాకవి, సామాన్యమైన వ్యక్తి'' అని పొగడటం మీకు గుర్తు ఉండే ఉంటుంది. వందేళ్ల తరువాత 1929లో అదే ఊరిలో లండన్ విశ్వ విద్యాలయం నుండి పట్టా పొందే అదృష్టం నాక్కలిగింది. ఓలెన్ ష్లేగర్ వారసుణ్ణి కాకపోయినా ఆయన అనుయాయులు, అభిమానుల్లో నేను ఒకణ్ణని అనుకుంటూ ఉంటాను.

స్కాండినేవియన్ దేశానికి చెందిన సహృద్ భావంతో ప్రస్తుతం స్వీడన్ దేశానికి, ఒకప్పుడు నా దేశస్తుడు ఆడమ్ ఓలెన్ ష్లేగర్‌కి, అత్యున్నతమైన గౌరవాన్నిచ్చి, నారచనల్ని ఇంతకుముందు రెండు సార్లు ఈ గౌరవానికి అర్హత గలవాటిగా నిర్ణయించిన దేశానికి నేను హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను.

**స్వీయచరిత్ర**

ఒకవైపు రైతులూ మరోవైపు చేతి వృత్తి పని వారూ పూర్వీకులు గాగల హెచ్. జెన్సెన్, డిస్ట్రిక్టు వెటర్నరీ సర్జను గారికి రెండో కుమారుడుగా ఉత్తర జట్‌లాండ్‌లో ఒకగ్రామంలో 1873లో జనవరి 20న నేను జన్మించాను. 1893లో ఇరవై యేళ్ళ వయస్సులో విబోర్గ్‌లోని కేథడ్రల్‌స్కూల్‌నుండి పట్టాపుచ్చుకుని, ఆ తరువాత మూడు సంవత్సరాలు కోపెన్ హాగన్ యూనివర్శిటీలో వైద్యశాస్త్రం చదివాను. సాహిత్యం, చదువులలో ఒక్కటే ఎంచుకునే సమయం వచ్చేవరకు నన్ను సాహిత్యమే పోషించింది. వైద్య శాస్త్రానికి ముందు అవసరార్థం చదివిన బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీలే నా సాహిత్య వ్యాసంగం ఒకరూపం దిద్దుకోవటంలో ముఖ్యమైన పాత్ర వహించాయి.

ఈ శతాబ్దపు ప్రారంభంలో నా సాహిత్య వ్యాసంగం 'హమర్‌లాండ్ కథలు' (1898 - 1910) ప్రచురణతో మొదలయింది. డెన్మార్క్‌లో నేను పుట్టిన ప్రాంతం ఈ కథలకి నేపథ్యం. ఆ తరువాత కాలంలో 1944 వరకు, నాకు బాగా నచ్చిన ప్రక్రియలు స్థల పురాణాలు, గాథలు రాసి వాటిని తొమ్మిది సంపుటాలుగా 1907-45ల మధ్యలో ప్రచురించాను. అదే 'మైటర్త్' (మిత్స్). నేను కవిత్వం, కొన్ని నాటకాలు, మానవ శాస్త్రంపైన పరిణామ క్రమం పైన చాలా వ్యాసాలు కూడా రాశాను.

నేను చాలా సంవత్సరాలు పత్రికల కోసం వ్యాసాలు, చరిత్రలు రాస్తూ ఏ పత్రికలోనూ ఉద్యోగంలో చేరకుండా ఉండి పోయాను. నేనెప్పుడూ ఏ రాజకీయ పక్షానికి కూడా చెందలేదు. తూర్పున ఉన్న మలయా, చైనా యాత్రల తరువాత, అమెరికాకు ఎన్నోసార్లు వెళ్ళి వచ్చిం తరువాత నేను డేనిష్‌సాహిత్యంలో అమెరికా ఇంగ్లీషు సాహిత్యాలలో ఉన్న సజీవ శక్తిని ప్రవేశపెట్టినా ప్రభావంతో అప్పుడు ప్రబలంగా ఉన్న క్షీణ ఫ్రెంచి ప్రభావాన్ని తుడిచి పెట్టేశాను. బాడి లేర్ విషప్రభావంలో అలంకారాలతో ఉన్న అప్పటి కవిత్వంపై, నేను సృష్టించిన సాహిత్యపు సారమంతా నిండి ఉన్న నా కవిత్వం తిరుగు బాటు ధోరణిలో సాగినట్టు భావించవచ్చు. నా కవిత్వం సులభమైనశైలిని, లోతైన వస్తువుని తిరిగి సాహిత్యంలో వెలుగులోకి తెచ్చింది.

నా వచన ప్రక్రియలలో ముఖ్యమైన వస్తువు పరిణామ క్రమం యొక్క పరిశీలన. నా అర్థ శతాబ్దపు సాహిత్య సేవలో నేను సాహిత్యంలో పరిణామక్రమం యొక్క ఫిలాసఫీని ప్రవేశపెట్టి పాఠకులు ఆదిశలో ఆలోచించేట్టు చేశాను. 19వ శతాబ్దపు చివరలో డార్విన్ సిద్ధాంతాన్ని ఎక్కువ మంది వక్రీకరించి భాష్యం చెప్తూ ఉండటం వల్ల, నేనీపని చెయ్యటం తప్పని సరి అయింది. ఈ ''అబర్‌మెష్'' అనే సిద్ధాంతం వల్ల ఎన్నో అనర్థాలు జరిగి, రెండు ప్రపంచ యుద్ధాలకు కారణమై చివరకు 1945లో జర్మనీ పతనం వల్లనే ఆనాశనం ఆగింది. ఆ సిద్ధాంతానికి చెప్పిన తప్పుడు భాష్యాలను ఖండించటంలో నేను పరిణామక్రమానికి మరో కొత్త భాష్యం చెప్పటం, దాని నైతిక ఫలితాలను వివరించటం జరిగింది.

**బహుమతి ప్రధానం**

1944లో సాహిత్యానికిచ్చే నోబెల్‌పురస్కారం పొందిన జొహనాస్ వి. జెన్సెన్ ఈ రోజు స్వయంగా బహుమతి అందుకుంటారు. ఈ శతాబ్దపు ప్రారంభం నుండి ప్రథమ శ్రేణిలో ఉన్న ఈ డేనిష్ రచయితకు, నిరంతరం శ్రమిస్తూ, కొన్నేళ్ళు వివాదాస్పదాలకు గురియై, ఆ తరువాత తన సజీవ సాహిత్యంతో అందరి మన్ననలనూ పొందిన జెన్సెన్‌కు, మేము వందనము చేస్తున్నాము. ఈ రాతి నేల, ఎడారి భూమైన జట్‌లాండ్ పుత్రుడు అంతరాల్లో ఉన్న కసేదో తీర్చుకోవటాని కన్నట్టు లోకాన్ని తన రచనల్లో ముంచెత్తి ఆశ్చర్య పరిచాడు. అయన్ని తేలిగ్గా స్కాండినేవియన్ రచయితలందరిలో ప్రతిభా సంపన్నుడిగా గుర్తించవచ్చు. ఎన్నోరకాల ప్రక్రియలతో - కావ్యాలు, కవితలు, ఊహాజనిత, యథార్థ రచనలు, చారిత్రిక, తత్త్వజ్ఞాన వ్యాసాలు, విజ్ఞాన శాస్త్రంలో వివిధ వస్తువులపై రచనలతో ఆయన విశాలమైన తన సాహిత్య సామ్రాజ్యాన్ని నిర్మించారు.

ఈ ధీశాలి, పోరాట కారుడు, శైలిలో ఎన్నో ప్రయోగాలు చేసి, ఒక జాతిపితగా, మహాకావ్యాల రచయితగా ఎదిగి, అంతరంగంలో స్వర్ణయుగపు సాహిత్యానికి దగ్గరై, ఏదో ఒక రోజు తన దేశంలో జీవ పునిర్మాణం చేసే సంరక్షకులలో తాను ఒకడిగా గుర్తింపు పొందుతానని ఆశపడుతున్నారు.

రచయితగా జెన్సెన్ వికాసం అద్వితీయమైనది. దేన్నైనా జయించాలనే తీవ్రమైన పట్టుదల అతని తత్త్వానికి ప్రాతిపదిక. రాతి నేలైన ఓట్‌లాండ్‌లో పుట్టి పెరిగిన అతని మనో ఫలకంపై అక్కడ మనుష్యుల, వస్తువుల గుర్తులు చెరగని ముద్రపడి పోయాయి. తరువాత రోజుల్లో ఆయన బాల్యంలో ముద్రపడిన బాహ్యానుభవాల, పూర్వపు ఐశ్వర్యమైన కుటుంబంలోని జ్ఞాపకాల వెనుకనున్న గతి సాధనాలూ గుర్తుకు తెచ్చుకున్నారు. ఆయన తండ్రి వెటర్నరీ డ్క్టరు ఆ ప్రాంతంలోనే పుట్టి పెరగగా ఆయన తాత, నేతపని వృత్తిలో ఉండే వాడు, రైతు కుటుంబంలో జన్మించాడు. సహజంగానే ఆయన తన మొదటి పుస్తకం తాను పుట్టి పెరిగిన ప్రాంతం గురించే రాశారు. సాటిలేని ఈ పుస్తకం 'హమర్ లాండ్ స్టోరియర్'లో ఇంకా ఆటవిక భయాల నుండి బయట పడని ఆది మానవుల్లాంటి ఈ ప్రాంతపు ప్రజలని చిత్రీకరించారు. చిన్న తనంలో ఆయన కలలు కన్న బంగారు లోకం, గతకాలపు అనుభవాలతో సజీవంగా ఉండేది, మనకు తిరిగి ఆయన పరిణితి చెందిన కవిత్వంలో కన్పిస్తుంది.

ఆయన మొదట్లో రాసిన పుస్తకాల్లో మనకు కన్పించేది ఒక గ్రామీణ యువకుడు, కొపెనే హాగన్‌లో

నివసిస్తూ ప్రతికూల పక్షంలో ఉండే విద్యార్థి, కొంత కఠినంగా ఉండి అలజడి చెందే యువకుడు, ఆవేశంగా మేధావుల ప్రపంచంలో నెలకొన్న స్తబ్దత, సంకుచిత్వాలపై దాడి జరిపే పోరాట వాది. ఈ ఓట్‌లాండ్ పుత్రుడు, సహజంగా బిడియస్తుడు, సున్నిత మనస్కుడు, త్వరలోనే తన దేశం పరిధి చాలా ఇరుకైనదనే నిర్ణయానికి వచ్చాడు. అలవాటైన డేనిష్ ద్వీపాల వాతావరణంలో ఉక్కిరి బిక్కిరై ఒక జూదిరికుంఢే ఆవేశంతో ఆయన విచిత్ర దేశాల భావానా ప్రపంచంలోకి దూకాడు. అలజడిగా ఉన్న, పరిధులెరుగని అతని ఊహాశక్తికి కావాల్సిన విశాలమైన లోకాన్ని అతని సుదూర ప్రయాణాలు మొదటి సారిగా ఇచ్చాయి. ఆయన పారిశ్రామీకీకరణని, సాంకేతిక అభివృద్ధిని మనసారా పొగిడాడు. జెన్సెన్ మన కాలపు అద్భుతాల ప్రవక్తలా ఆకాశ హర్మ్యాల గురించీ, కార్ల గురించీ, సినిమా గురించీ ప్రస్తావించి, వీటిని తన అమెరికన్ నవలల్లో విసుగు లేకుండా పొగిడాడు. ఇవి 'మదామ్‌డోజీరా' (1904), 'హ్యూలట్ట్' (1905). తన దూర ప్రయాణాల తర్వాత ఆయన త్వరలోనే దిగంతరాలనొదిలి కాలం వైపు దృష్టిసారించాడు. ఆధునిక జీవితాన్ని, అందులో వేగాన్ని, పరుగుల్ని, ప్రశంసించిన ఆయనే పూర్వపు శకాలని దర్శించి, ఆ కాలపు స్తబ్దతలో నెమ్మదిగా చలించే సమయంలో మానవుడి సాహసోపేతమైన జీవితాన్ని కోరుకోవటం చూపించాడు.

ఆయన రచనల్లో చాలా ముఖ్యమైన 'డెన్ లాంగే రేజ్సె' మనను మంచు శకం నుండి క్రిస్టఫర్ కొలంబస్ కాలం వరకు నడిపిస్తుంది. ఇందులో కథా సారాంశం స్కాన్‌డినేవియన్ ప్రజల అన్వేషణ; మొట్ట మొదట జరిగిన పెద్ద పెద్ద వలస ప్రయాణాల నుండి, నార్మన్, దండయాత్రల నుండి అమెరికాను కనుక్కొనేంతవరకు జెన్సెన్ కొలంబస్‌ని లంబార్ట్స్ వారసుడిగా, నార్డిక్ జాతీయుడిగా, ఇంకా చెప్పాలంటే తనలాగే ఓట్‌లాండ్ ప్రాంతీయుడిగా భావించారు. ఇదే పుస్తకంలో మనకు కన్పించే ఇతిహాస పురుషుడు నార్నజెస్టర్. ఇతడు జీలాఫ్ ట్రైగ్‌వాసన్ రాజు సభలో కథలు చెప్పటానికి వెళ్లి అక్కడ మరణించిన నార్న జెస్టర్ కంటే భిన్నమైన వాడు. ఐస్‌లాండ్ చరిత్రల్లో అతడు మూడువందల ఏళ్ళవాడు కానీ జెన్సెన్ అతడ్ని అంతకంటే పూర్వకాలపు వాణ్ణిచేసి, అంతటా ఉండేవాడిగా, తన కాలంకంటే వెనక్కు ఉండే వాడిగా, కొత్త తరాలవారిలో పరాయి వాడిగా అయినా వారికంటే పడుచువాడిగా చేసిన కారణమేమంటే అతడు జీవించిన కాలమే పడుచుదనంలో ఉండి మానవ జాతి అవతరణకి దగ్గరగా ఉంది కనుక. నార్న జెస్టర్ పసిబిడ్డగా ఉన్నప్పుడు ముగ్గురు కాలజ్ఞానులు అతని తల్లి దగ్గరగా వచ్చారు. వారిలో ఒకామె అక్కడ వెలుగుతున్న కొవ్వొత్తి ఆరపగానే అతడు మరణిస్తాడని చెప్పింది. ఆతల్లి వెంటనే ఆ కొవ్వొత్తిని ఆర్పేసి, తన బిడ్డ చేతికి తావీజుగా ఇచ్చింది. జెన్సెన్ కథలో నార్నజెస్టర్ ఒక్కోసారి ఆ కొవ్వత్తిని పరాయి దేశాలలో వెలిగిస్తాడు. అతడలా చేసినప్పుడల్లా అతడి కళ్ళముందు కాలం అగాధంలా నోరు తెస్తుంది. జీవితంపై ప్రేమ ఉప్పొంగి, తిరిగి లోకంలో పడగానే ఆకుపచ్చగా ఉన్న జీలాండ్‌లో తన మాతృ భూమిలో అతడు కళ్ళు తెరిచేవాడు.

అసలా స్థల పురాణాలెందుకుంటాయంటే హేతువు మానవ అనుభవాలన్నింటినీ విశదీకరించలేదు కనుక. అలా అయితే ఈ మహాకావ్యంలో ముఖ్య భూమిక పోషించే నార్న జెస్టర్ ఏమిటి? రాత్రి పూట మాత్రం కన్పించే మాయారూపంలాంటి నార్డిక్ ప్రజల ఆత్మా లేక ఒక ఆటవిక జీవా? మా సందేహమేమంటే ఒకవాయిద్యంతో ప్రపంచమంతా చుట్టి వచ్చే ఈ అద్వితీయమైన

వ్యక్తి రచయితకు అతి దగ్గర సంబంధం ఉన్నవాడనీ, రచయితే అతనికి జీవన్మరణాల గురించి, ప్రస్తుతానికి శాశ్వితానికీ ఉన్న విడదీయరాని బంధంగురించి ఆలోచనలు భూగోళంపై దేశాలు, సముద్రాలు తిరిగి వచ్చిన తన విలువైన అనుభవాల ఫలం ఇచ్చాడని.

కఠినమైన రాతినేల ( ఓటలాండ్ భూమ్యాకాశాలు కలిసే గీతను ఇక్కడ సమాధులే విభజిస్తాయి) లో పెరిగిన జెన్సెన్ నిజాలకి, మిత్స్‌కి మధ్య, భూత కాలపు నీడలకి ప్రస్తుతపు వాస్తవానికి మధ్య తన అభిరుచిని పంచటం సహజమే. ఆయనను చూసి మనం తెలుసు కోవాల్సిందేమిటంటే సున్నిత మనస్కుడైన రచయితకు ఆదిమశక్తులపై ఆకర్షణ, రెండోది ఆటవిక బలాన్ని మమకారంగా మార్చు కోవాల్సిన అవసరం. ఈ భేద విచారము మూలానే ఆయన తన ప్రతిభ యొక్క శిఖరాలు చేరుకోగలిగాడు. ఒక చల్లటి ఉప్పటిగాలి కెరటం అతని రచనల్లో నుండి వీస్తూ అందులోని స్పష్టమైన భాష ద్వారా, ఒక శక్తివంతమైన వ్యక్తీకరణ, అద్వితీయమైన ప్రతిభమునకందజేస్తుంది. తమప్రాంతంతో విడదీయరాని అనుబంధం గల కవుల పదప్రయోగంలో అత్యంత ప్రతిభ కూడా కన్పిస్తుంది. జెన్సెది ఓటలాండ్ గొంతుక, డెన్మార్క్ యొక్క గొంతుక. నార్డిక్ ప్రజల ప్రకృతి శక్తులపై విజయవంతమైన పోరాటం, నార్డిక్ ప్రజల ఆత్మ ముందు తరాలకు సాగిపోవటం అద్భుతంగా సాహిత్యంలో చిత్రించినందుకు ఆయనకు అత్యంత ప్రతిభావంతుడైన కథకుడిగా బిరుదు ఇవచ్చు.

జెన్సెన్‌గారూ! మీరు నా ఉపన్యాసం వినివుంటే మీ సాహిత్యంలోను దీర్ఘయాత్ర చేయటానికి, ఈ కొద్ది క్షణాలు చాలవనీ, అందులో ఎన్నో ముఖ్యాంశాలు నేను వదిలేశానని, గ్రహించే ఉంటారు. అసలు మిమ్మల్ని పూర్తిగా పరిచయం చెయ్యాల్సిన అవసరం లేక పోవటం మీ అదృష్టం. మా అదృష్టం కూడా. మీరు మాకుటుంబంలో చిరపరచితులైన సభ్యులుగా మా మహారాజు దగ్గర నుండి స్వీడిష్ అకాడమీ ఇచ్చే పురస్కారాన్ని స్వీకరించ ప్రార్థన.

**- ఆండర్స్ ఆస్టర్‌లింగ్ ( శాశ్వత కార్యదర్శి, స్వీడిష్ అకాడమీ)**

## ప్రసారంమైన ఉపన్యాసం

జొహానెస్ వి. జెన్సెన్ రాసిన వచన కావ్యాలన్నిటిలో 'డెన్ లాంగెరెసే' (1908 - 22) (సుదూర ప్రయాణం) ఎక్కువగా ప్రజాభిమానం చొరగొన్నది. ఈ మహాకావ్యంలో వస్తువు మనిషి ఆత్మ అనే స్పృహ లేకుండా మూగగొడ్డులా జీవించే స్థితి నుండి, ప్రకృతి శక్తులకు సులభంగా బలి అయ్యే స్థితి నుండి అభివృద్ధివైపు సాగే నాగరికతల దిశగా పయనించటం. ఇందులో ఆరు పెద్ద కథలు సాహస కృత్యాలతో నిండి, మానవుడి మొదటి నివాసంగా జెన్సెన్ భావించే ఉష్ణప్రాంతాల్లో జరిగాయి.

మొదటి కథ నేపథ్యం ఐరోపాలో కీకారణ్యాలలోని ఒక పెద్ద అగ్నిపర్వతం. దాని శిఖరం మీద పైకెగిసే మంటలు విరజిమ్ముతూ, తరచూ కుతకుతలాడే లావా కక్కుతుంటే అది పొంగి పర్వతాలు మీదుగా ప్రవహిస్తూ దారిలో అన్నిటిని నాశనం చేస్తుంటుంది. ఎన్నో శతాబ్దాలుగా ఆది మానవుడు అగ్ని దేవుణ్ణి మూగ భీతితో పూజించాడు. మానవ చరిత్రలో అత్యంత అద్భుతమైన క్షణం, గొప్ప మనస్తత్వం గల మనుష్యుల్లో నుండి పట్టుదల, బుద్ధి కుశలత గల ప్రొమిథియస్ అవతరించిన సమయం.

అనూహ్యమైన శక్తులను నిర్భయంగా ఎదుర్కొని, అగ్ని యొక్క రహస్యం ఛేధించి, ఒక దివిటీపై దాన్ని భూమిపైకి తెచ్చి, మనిషికి ఉపయోగపడేట్టు చేశాడతడు. మృగాలను దూరంగా ఉంచటానికి కూడా మంటలు ఉపయోగపడ్డాయి. ఆ తరువాత నక్షత్రాలను చూసి కాలాన్ని గుణించడం నేర్చుకుని చీకటి యుగం నుండి నాగరికతవైపు మరో అడుగు వేశాడు. అలాగే మనుష్యుల మధ్య నాగరికమైన సాంగత్యం నెలకొలిపి స్త్రీపురుషుల దేహబంధాల స్థానంలో వలపు, ప్రేమలాంటి వేమిటో తెలియ జేసాడు. చిట్టచివరలో అతడు ఒక ప్రవక్తలా అల్లరి మూకల చేతిలో మరణించినా ముందు తరాలవారికి అతడు ఒకగొప్ప తరగని నిధి వదలి వెళ్ళాడు.

ప్రపంచం ఎన్నో మార్పులు జరిగి, అగ్నిపర్వతాలు శక్తి హీనమై పోయి, వాతావరణం చల్లబడి పోయింతరువాత, అంతు తెలియని కాలం ముందుకు పోయిం తరువాత, ఇంకొక మహనీయుడితో, మూలపురుషుడితో రెండో కథ మొదలవుతుంది. భూమి దక్షణం వైపుకి జనాలంతా వలస వెళ్ళి సాగారు. ఒకే ఒక్క మనిషి మాత్రం ఎదురీత మొదలుపెట్టి, కైన్‌లాగా అన్న దమ్ములతో పరిత్యజించబడి, మంచు కప్పిన ఉత్తర దేశాలవైపు కష్టాల నెదుర్కొంటూ ప్రయాణం చేసి రాటుతేలాడు. అతడు అక్కడికి తన లాగే చేరిన స్త్రీని చేరి, జెన్సెన్‌కి ప్రియమైన నార్డిక్ జాతికి మూలపురుషుడయ్యాడు. అతడు పూర్వంలోలా, ఎవరినీ అనుకరించి కాకుండా, స్వశక్తితో రెండు ఖనిజాల మధ్య అగ్నిని సృష్టించి మరో నాగరికతను సృజించాడు.

ఇలాంటి వస్తువుతోనే మూడో కథ మరో మేధావి గమన శక్తిని సృష్టించటంలో, పడవలు, బండ్లు నడిపించటంతో మొదలవుతుంది. ఆ కాలంలో ఉత్తర దేశపు పురుషులు ఉష్ణదేశాల పిలుపులు విని, సుదూర ప్రయాణాలకు సంసిద్ధులవుతారు ఈ కథలో.

ఆ తరువాతి కథలు ఈ ప్రయాణాలను వర్ణిస్తూ మనను మనమెరిగిన చారిత్రిక కాలం వైపు నడిపిస్తాయి. ఇందులో మనకు కన్పించేవి సింబ్రియన్ల రోమ్‌పై దాడి, లైకింగుల దండయాత్రలు. ఈ కథల ముఖ్యోద్దేశం కొలంబస్ ఉష్ణ మండలంలో భూలోక స్వర్గాన్ని కనుక్కోవటమనే తన కల నిజం చేసుకోవటంతో నెరవేరుతుంది.

జెన్సెన్ ప్రతిభాశక్తి అంతులేనిది, సంపన్నమైనది, అతని వర్ణనా శక్తి పరాజయ మెరుగనిది. పెద్ద పెద్ద వర్ణ చిత్రాల క్రమంలా ఉండే ఈ గ్రంథంలో పాత్ర చిత్రణకంటే వివిధ అంశాల మేళవము, నైపుణ్యంగల కుంచె వేసే గీతలు ముఖ్యమైనవి.

జెన్సెన్ మరింత లోతైన మనస్తత్వ చిత్రీకరించిన కథలు, అతని జన్మభూమి నేపథ్యంలో నడిచిన 'హిమర్‌లాండ్ స్టోరియర్' (1898 - 1910). ఇసక తుప్పలతో నిండిన హిమర్ లాండ్ ప్రాంతంలో జీవనం సాగించటానికి కఠినాతి కఠినమైన పోరాటం చేసే ఇక్కడి ప్రజలు, తమ పూర్వీకుల నుండి పొందిన ఆటవిక శక్తిని పోగొట్టుకోలేదు. వీళ్ళు మాటల మనుష్యులు కాక సులభంగా ఆవేషకావేషాలకు లోనయ్యే చేతల మనుష్యులు. వీళ్ళల్లో ఘోరాలను భరించే శక్తి దాని మూలంగా తొణికిసలాడే ఒక విలక్షణమైన హాస్యం, జెన్సెన్ రచనల్లో హృద్యంగా మేళవమై కన్పిస్తాయి. ఈ కథల్లోని పరిపూర్ణమైన ప్రతిభాశక్తి మూలాన ఇవి అప్పుడే డేనిష్ భాషలో మహా కావ్యాలుగా పరిగణింప బడుతున్నాయి.

చాలా సంవత్సరాల వరకు జెన్సెన్ వివిధ రకాలైన తన రచనల్ని 'మైటర్' (1907-45) (Myths) పేరిట సంపుటాలుగా ప్రచురించారు. ఇవి ఎంతగా ప్రచారం చెందాయంటే డేనిష్‌లో ఒక కొత్త సాహితీ ప్రక్రియగా 'మిత్' అనే రూపం పొందాయి. ఈ ప్రక్రియను నిర్వచించటం కష్టతరం. ఒక్కొసారి జెన్సెన్ సాధారణ ప్రపంచాన్ని వదలి ఊహా ప్రపంచాన్ని శోధించటానికి ప్రయత్నించి కృతకృత్యుడై దీనికి అర్థం కల్పించాడనిపిస్తుంది. ఇది ఆయన ఉత్తమ పురుషలో తన అనుభవాలను వర్ణించటం వల్ల సాధ్యపడింది. ఆయన 'మిత్' లలో నిజమైనవిగా అన్పించే సంఘటనలూ, అనుభవాలూ సృష్టించినట్లే, ఎంతో నిజాయితీతో తన ఆలోచనల్నీ, సిద్ధాంతాల్నీ విశదీకరిస్తారు. అయన కథనాలలో ఒక అద్భుతమైన దృశ్య కవిత్వం, జీవితానికి చాలా దగ్గరగా ఉండటం కూడా కన్పిస్తాయి.

ఒక్కొసారి ఆయన పకృతిలొ పరిణామాలు ఎంత అద్వితీయమైన సహజ జ్ఞానంతో, ప్రతిభావంతమైన అంతర్దృష్టితో వర్ణిస్తారంటే ఆయన చేతిలో మలచబడ్డ 'మిత్' అనే ప్రక్రియను దాని సాధారణ అర్థంలో కూడా తీసుకోవచ్చు. ఇన్నిరకాలైన ప్రక్రియల్లోనూ ఉన్నది సూటైన శైలి. అదేశైలిలో ఉన్న జెన్సెన్ యొక్క సైన్సు రచనలను, మేనిఫెస్టోలను కూడా సాహిత్యంగానే పరిగణించవచ్చు.

'డెన్ లాంగెరెసే' కు సమాంతరంగా నడిచే 'వోర్ ఆప్రెండల్సే' (our origin) (1941) ను ఈ సందర్భంలో గుర్తు చేసుకోవాలి. ఇందులో మానవుడు స్తబ్దత నుండి బయటపడి పరిణామ క్రమాన్నే ప్రభావితం చేయటంతో మొదలవుతుంది. ఇందులో మనిషి అగ్నిపై ఆధిపత్యం సంపాదించటం, మొట్ట మొదటి అయుధాలు తయారు చేయటం, వృత్తి పనులలో క్రమేణా నైపుణ్యం సంపాయించటం మొదలైన చరిత్ర పథంలో ముందడుగులన్నీ మానవుడు వేయటం ఆయన మనకు కళ్ళకు కట్టినట్లు చూపిస్తాడు.

డేనిష్ దేశంలో ఆయన వచనానికెంత పేరుందో కవిత్వానికి కూడా అంతే పేరుంది. ఆయన కవిత్వంలో ముఖ్యలక్షణం వివిధ రకాల రూపాలలో ప్రదర్శితమైన ఆయనకున్న మాతృభూమి పట్ల గాఢమైన ప్రేమ. ఒక్కోసారి సాంప్రదాయకమైన యమకంలో, ఒక్కోసారి ఆధునికమైన వచన కవితగా. సాంప్రదాయకంగా ఉన్న ఆయన కొన్ని కవితల్లోని మధురిమ డేనిష్ కవిత్వంలోని స్వర్ణయుగాన్ని తలపుకు తెస్తుంది. వాటిలో ఆయన తన ప్రజ్ఞా పర్వతపు శిఖరాలు చేరుకుని తన వ్యక్తిత్వంలోనూ, కళలోనూ కూడా కొత్త కోణాలు ప్రదర్శించారు.

ముఖ్యంగా యాంత్రిక యుగంపై ఆయన తన దృష్టిని సారించారు. సైన్సు యొక్క అతివేగపు గమనం ఆయన్ని ఆశ్చర్యంలో ముంచెత్తి మంత్ర ముగ్ధుణ్ణి చేసింది. ఆ వేగం ఎంత ఎక్కువగా ఉంటే సైన్సు ఆయన్ని అంత ఎక్కువగా వ్యామోహ పరిచింది. ఇటువంటి దృక్పథంలో పాతకాలపు విలువలకు స్థానం లేదు. దీనికి స్వప్నలోకాల్లో నడవటానికి పువ్వుల మైదానాలక్కర లేదు. కలలు కంటానికి అనంతమైన ఆకాశం అక్కరలేదు.

అదృష్టవశాత్తూ జెన్సెన్ యొక్క సంపన్నమైన సృజనాత్మకమైన మేధస్సు తరచు భవిష్యత్తులోని అద్భుతాలని మరచి, మనిషి అస్థిత్వానికి మూలాధారమైన సౌందర్యపు భావప్రేరితమైన విలువలన్నీ కూడా పరిశీలించింది.

- పార్‌హోల్‌స్ట్రామ్ ( అధ్యక్షుడు, స్వీడిష్ అకాడమీ)

# కృష్ణ బిలం

–సి. వి. సర్వేశ్వర శర్మ

ఖగోళ విజ్ఞానం అభివృద్ధికి నాంది పలికింది గెలీలియో. 1609లో తొలి సారిగా గెలీలియో టెలిస్కోప్ సహాయంతో ఈ విశాల విశ్వాన్ని చూశాడు. ఆకాశవీధిని కనిపించే అద్భుతాల గుట్టురట్టు చేయడానికి ఆనాటి నుండి మానవుడు పట్టువదల కుండా కృషి చేస్తూనే వున్నాడు.

మనిషి మేథకు గిలిగింతలు పెడుతూ ఊహకు, పరికల్పనకు పనికల్పిస్తున్న ఒక ఖగోళ అద్భుతం 'కృష్ణబిలం'. నిజానికి మన సౌరకుటుంబం ఉన్న గెలిక్సీ మధ్య భాగంలో ఒకే పెద్ద 'కృష్ణ బిలం' ఉందని శాస్త్ర వేత్తల ఊహ.

**నక్షత్రాల ఆవిర్భావం**

విశ్వంలో కన్పించే ప్రతినక్షత్రానికి పుట్టుక, బాల్యం, యవ్వనం, మరణం ఉంటాయి. విశ్వం ఆవిర్భవించే ముందు విశ్వ పదార్థం అంతా ఒక ముద్దగా ఉండేది. ఇది ప్రేలి విస్తరించడం మొదలయింది. ఈ ప్రక్రియలో అనేక రసాయనికి ధాతువులు ఏర్పడ్డాయి.

వేడివేడిగా వున్న ఈ విశ్వపదార్థం క్రమ క్రమంగా చల్లారి గురుత్వాకర్షణ ప్రభావం వల్ల వాయు మేఘాలుగా రూపం పోసుకున్నాయి. ఈ వాయు మేఘాలు తమ చుట్టూ అవి పరిభ్రమించడం ఆపైన మరింత చిన్న చిన్న వాయు మేఘాలుగా విడిపోవడం జరిగింది.

ఈ చిన్న వాయు మేఘాలు దగ్గరగా సంకోచింప బడ్డాయి. అప్పుడు వాటిలో కేంద్రక చర్యలు ప్రాణం పోసుకున్నాయి. ఈ కేంద్రక చర్యల వల్ల విడుదలయిన శక్తి ఆ వాయు మేఘం గురుత్వాకర్షణ శక్తిని అధిగమించి బయటకు కాంతి రూపంలో విడుదల కావడం ఆరంభమయింది. ఈ దశలోనే వాయు మేఘం నక్షత్రంగా దర్శనం ఇవ్వడం మొదలయింది.

నక్షత్ర ఆవిర్భావానికి చెందిన కథ కమామిషు అది. చెప్పడం ఇంత తేలిగ్గా చెప్పినా ఈ పని జరగడానికి కొన్ని కోట్ల సంవత్సరాలు పట్టింది. నక్షత్రంలో జరిగే కేంద్రక చర్యల వల్ల అందలి పదార్థం కాలం గడుస్తున్న కొలది హరించుకు పోతుంది.

అంటే నక్షత్రం క్రమంగా మరణ దిశవైపుకు వెడుతుంది. నక్షత్రంలోని అణు ఇంధనం పూర్తిగా అయి పోగానే నక్షత్రం మరణిస్తుంది. అంతవరకు నక్షత్రంగా దర్శనం ఇచ్చిన ఆ నక్షత్రం 'బ్లాక్ హోల్' అంటే 'కృష్ణ బిలం'గా మారి పోతుంది.

ఖగోళ భౌతిక శాస్త్రం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ ఎన్నెన్నో వెలుగులోకి తెస్తోంది.

---

శ్రీ సి.వి. సర్వేశ్వర శర్మ, అమలాపురం, శ్రీకోనసీమ భానోజీ రామర్స్ కళాశాలలో భౌతిక విజ్ఞానశాస్త్ర శాఖలో రీడర్‌గా పనిచేస్తున్నారు.

ఈ నేపథ్యంలో శాస్త్రవిజ్ఞానంలో చేరిన కొత్త అంశాలు క్వాజార్స్, పల్సార్స్, బ్లాక్ హోల్స్.

క్వాజార్స్ అంటే 'క్వాసీస్టెల్లార్ రేడియో సోర్సెస్' అనే ఆంగ్లపదానికి సంక్షిప్త రూపం, పల్సార్స్ అంటే' పల్సేటింగ్ రేడియో సోర్సెస్'. బ్లాక్ హోల్స్ అంటే కృష్ణ బిలాలు అని చెప్పుకున్నాం.

వస్తువుపై కాంతి పడితే అది మనకు కన్పిస్తుంది. తమాషా ఏమిటంటే ఈ కృష్ణ బిలం పై కాంతి పడితే ఆ కాంతిని అది లోపలకు లాగేసుకుంటుంది. ఈ కృష్ణ బిలం గురుత్వాకర్షణ బలం పరిధిని దాటి కాంతి బయటకు రాలేదు. అంటే దీని ఆకర్షణ బలంతో కాంతిని కూడా బయటకు వెళ్లకుండా అదిమి పెట్టగలదు. ఇదొక అద్భుతం.

కంటికి కనబడకుండా తన వైపుకు ఏమి వచ్చినా లోపలకు లాగేసుకునే శక్తిగలది కావడం వల్లనే దీనిని 'కృష్ణ బిలం' ('నల్లని గొయ్యి') అని పిలుస్తున్నారు.

**బరువును బట్టి నక్షత్రాల రకాలు**

నక్షత్రాలను వాటి బరువులను బట్టి మూడు తరగతులుగా విభజించారు. మొదటి తరగతి నక్షత్రాలు మన సూర్యుడి బరువుతో సమానం లేదా కొంచెం ఎక్కువ బరువు కల్గినవి.

ఈ నక్షత్రాలు క్రమంగా వాటిలోని శక్తిని కోల్పోవడం మొదలవగానే అవి పెద్దగా విస్తరించడం మొదలయి దాని రంగు ఎర్రగా తయారవుతుంది. అందుకే వీటిని 'రెడ్ జయంట్స్' అని పిలుస్తారు.

ఈ 'రెడ్ జయంట్స్' లోని శక్తి హరించుకు పోవడం కొనసాగుతూ ఉండడం వల్ల ఇవి శ్వేతకుబ్జతార అంటే 'వైట్ డ్వార్ఫ్' లుగా మారుతాయి.

ఈ వైట్ డ్వార్ఫ్‌ల లోని వేడి, వెలుతురు క్రమంగా అయి పోయి అవి నల్లని ముద్దగా తయారవుతాయి. దీనిని 'బ్లాక్ డ్వార్ఫ్' అంటారు. మనకు వేడి వెలుతురు ఇస్తున్న సూర్యుడు కూడా ఇదే తరగతి నక్షత్రం.

**రెండవ తరగతి నక్షత్రాలు**

మొదటి తరగతి నక్షత్రాలకు కొన్ని రెట్లు ఎక్కువ బరువు గల్గిన నక్షత్రాలను రెండవ తరగతి నక్షత్రాలుగా పేర్కొన్నారు. ఇవి అంత్య దశలో బోలెడంత శక్తిని విడుదల చేస్తూ పేలిపోతాయి.

ఈ విధంగా పేలినపుడు వెలువడే కాంతి, వెలుతురు సాధారణ నక్షత్రం వెలువరిచే కాంతి, వెలుతురు పరిమాణాలకు దాదాపు పదిలక్షల రెట్లు ఎక్కువ పరిమాణంలో ఉంటుంది. ఈ దశను 'సూపర్ నోవా' అంటారు.

**చంద్రశేఖర్ లిమిట్**

మొదటి తరగతి నక్షత్రాలు వృద్ధాప్య దశ శ్వేత కుబ్జనక్షత్రాలు. ఈ నక్షత్రాల నుండి ఏరకమైన శక్తి

జనించదు. అంటే ఇది తన ద్రవ్యరాశిని ఖర్చు పెట్టుకుంటూ బ్రతుకుతుంది.

ఇలా ఉన్న ఆస్తిని ఖర్చు బెట్టుకోవడంతో క్రమంగా అది మృత నక్షత్రంగా మారి పోతుంది. ఈ స్థితిలో దీని సాంద్రత అపరిమితంగా పెరిగిపోతుంది. 1 ఘన సెంటీమీటర్‌కు $10^6$ గ్రాములు ఉంటుంది. దీనినే 'డీ జనరేటెడ్ వాయువు' అంటారు.

సుబ్రహ్మణ్య చంద్ర శేఖర్ తన పరిశోధనల ఫలితంగా సూర్యుని ద్రవ్యరాశి కంటే 1.4 రెట్లు తక్కువ ద్రవ్యరాశి గల నక్షత్రాలు మాత్రమే ఈ సాంద్రతలో వున్న గురుత్వాకర్షణ శక్తిని తట్టుకో గలవని సిద్ధాంతీకరించాడు. దీనినే చంద్రశేఖర్ లిమిట్ అంటారు.

అంటే ఏ నక్షత్ర మైన దాని బరువు సూర్యుని బరువుకన్నా 1.4 రెట్లు ఎక్కువ వుంటే అది 'వైట్‌డ్వార్ఫ్'గా మార్పు చెందక పేలిపోతుంది.

**న్యూట్రాను తారలు**

నక్షత్రం బరువు చంద్రశేఖర్ లిమిట్ దాటితే అది పేలాలి. అయితే పరమాణు భౌతిక శాస్త్ర సిద్ధాంతం అవి పేలాలనే ఖచ్చితమైన నిర్ణయాన్ని సమర్థించదు.

'డీజనరేటెడ్ గ్యాస్' లో ఎలక్ట్రానులు, పరమాణువుకు దూరంగా ఉండక దాని న్యూక్లియస్ (కేంద్రకం) వైపుకు బాగా నొక్క బడతాయి. ఈ ఎలక్ట్రాన్లు ప్రొటాన్లతో కలసి న్యూట్రాన్లుగా మారి పోతాయి.

ఇలా తయారయిన నక్షత్రాలను న్యూట్రాన్ నక్షత్రాలు అంటారు. ఈ నక్షత్రాలు 'సూపర్‌నోవా' దశకు చేరుకుంటాయి.

**మూడవ తరగతి నక్షత్రాలు**

సూర్యుని పరిమాణం కన్నా పదిరెట్లు లేదా అంతకన్నా ఎక్కువగా ఉండే నక్షత్రాలను మూడవ తరగతి నక్షత్రాలుగా గుర్తిస్తారు. ఈ నక్షత్రాల అంత్యదశ అటు 'బ్లాక్ డ్వార్ఫ్' గానూగాక ఇటు న్యూట్రాన్ నక్షత్రంగాను గాక మరొక రకంగా ఉంటుంది.

ఈ నక్షత్రాలు 'కృష్ణ బిలాలు'గా మారుతాయి. 'కృష్ణబిలం' అంటే పదార్థం అంతా నక్షత్రంలో దగ్గరగా నొక్కుకు పోతుంది. ఆ పైన ఈ కృష్ణ బిలంలో గురుత్వాకర్షణ శక్తి ఊహా తీతంగా ఉంటుంది. ఈ శక్తి కృష్ణ బిలం ఉన్న ప్రాంతంలో చాలా దూరం విస్తరించి ఉంటుంది.

ఈ 'కృష్ణ బిలం' ఫలానా చోట ఉందని గుర్తించడం కష్టం. మరి అటువంటప్పుడు ఈ 'కృష్ణ బిలం' ఉందని చెప్పడం ఎలా? అని అనుమానం కల్గుతుంది.

'కృష్ణ బిలం' గురుత్వాకర్షణ శక్తి కారణంగా దాని చుట్టూ ఉన్న నక్షత్రాలు క్రమ పూరిత గమనం

దెబ్బతిని క్రమ రాహిత్యంలో చలిస్తూ ఉంటాయి. ఈ గమన రాహిత్యం ఆధారంగా 'కృష్ణ బిలం' ఉనికిని ఊహించవచ్చు.

విశేష బలంతో దేనినైనా ఆకర్షించగల కృష్ణ బిలంలో పదార్థ కణాలు ఒకదానినొకటి ఢీకొనడం వల్ల ఎక్సు కిరణాలు విడుదలయ్యే పరిస్థితిని ఆసరాగా చేసుకుని 'కృష్ణ బిలం' ఉనికిని తెలుసుకుంటారు.

**'కృష్ణ బిలం' ఉనికికి ఆధారం**

పాలపుంత సహా ప్రతి నక్షత్ర మండలం (గెలాక్సీ) కేంద్రంలో కృష్ణ బిలాలు ఉన్నాయని అమెరికన్ ఖగోళ శాస్త్ర వేత్తలు నిర్ణయించారు. పెద్ద పెద్ద నక్షత్రాలు తమలోని అణుశక్తిని కోల్పోతే కృష్ణ బిలాలు తయారవుతాయి.

కొన్ని నక్షత్రాలు సూర్యుని కన్నా యాభయి రెట్లు పెద్దవి. వీటి గురుత్వాకర్షణ శక్తి ఎక్కువ. వీటి సమీపంలో భ్రమణం చేస్తున్న ఇతర నక్షత్రాలు 'కృష్ణ బిలం' వైపుకు ఆకర్షితమవుతాయి.

ఈ విషయం ఆధారంగా మిచ్‌గన్ విశ్వవిద్యాలయానికి చెందిన డగ్లస్ రిచ్ స్టోన్, కారెవ్‌గెబ్ హార్‌లు ఒక కంప్యూటర్ నమూనాను రూపొందించారు.

గెలాక్సీల కేంద్రానికి సమీపంలో ఉన్న నక్షత్రాలు ఎంత వేగంగా తిరుగుతున్నాయో కంప్యూటర్ ఆధారంగా విశ్లేషించి తెలుసుకున్నారు.

గెలాక్సీల కేంద్ర సమీపంలోని నక్షత్రాలు తిరగాల్సిన వేగంకన్నా ఎక్కువ వేగంగా తిరుగుతున్నట్లు ఈ శాస్త్ర వేత్తలు కనుగొన్నారు.

కృష్ణ బిలం ఆకర్షణకు లోను కాకుండా దానికి సమీపంలో ఉండే నక్షత్రాలు అమిత వేగంగా తిరుగుతాయి. కృష్ణ బిలానికి నక్షత్రాలు దగ్గరగా ఉండేకొలదీ అవితిరగే వేగం బాగా ఎక్కువగా ఉంటుంది.

హబుల్ టెలిస్కోప్ నక్షత్రాలు తిరగే వేగంలో ఏమాత్రం తేడావున్నా పసిగట్టగలదు. ఈ విధంగా నక్షత్రాలు తిరగే వేగంలో మార్పులు వున్నట్లు హబుల్ టెలిస్కోప్ ఆధారంగా ఈ శాస్త్రవేత్తలు గుర్తించారు.

విశ్వం తొలిదశలో ఉండే క్వాజార్ల సంఖ్యకు, ప్రస్తుతం కనుగొన్న బ్లాక్ హోల్స్ సంఖ్య సరిపోతోందని ఒకనాటి క్వాజర్లే నేటి 'బ్లాక్‌హోల్స్' అనే వాదాన్ని ఈ పరిశీలనలు సమర్థిస్తున్నాయని ఈ శాస్త్ర వేత్తలు ప్రకటించారు.

**కృష్ణ బిలాల గరిష్ఠ భ్రమణ వేగం**

నక్షత్ర మండలంలో రెండు కృష్ణ బిలాలు గరిష్ట వేగంలో భ్రమణం చేస్తున్నట్లు 'నాసా' శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సెకనుకు ఇవి పదివేల భ్రమణాలు చేస్తున్నాయట.

ఒక పెద్ద నక్షత్రం విస్ఫోటనం చెందినపుడు, దాని గురుత్వాకర్షణ శక్తి మిగిలిన పదార్థాలను అస్తిత్వం నుండి తొలగిస్తుంది. కృష్ణ బిలం గురుత్వాకర్షణ శక్తి ఎంత గొప్పది అంటే దానికి కొన్ని వేల కిలో మీటర్ల దగ్గరకు వచ్చిన వస్తువులను కఘాడా అదిలాగేస్తుంది.

ఈ దూరపు సరిహద్దును 'ఈవెంట్ హొరైజన్' అంటారు. 'కృష్ణ బిలం' గిరగిరా తిరుగుతూ ఉంటే చుట్టూ వున్న అంతరిక్షం కూడా ఈ తిరుగుతున్న బలానికి లాగినట్లు అవుతుంది.

కృష్ణ బిలం ఎంత వేగంగా భ్రమణం చేస్తున్నది సూటి పద్ధతిలో కనుగొనడం కష్టం. అందుకే పరోక్ష పద్ధతిలో కనుగొన్నారు నాసా శాస్త్రవేత్తలు.

కృష్ణ బిలం భ్రమణ వేగానికి 'ఈ వెంట్ హొరైజన్'కు మధ్య ఒక సంబంధం కనుగొన్నారు. భూమికి ఇటువంటి పరిస్థితి ఉండదు. ఎందుకంటే ఉపగ్రహ వేగాన్ని పెంచుకుని అది భూమి వైపు పడి పోకుండా జాగ్రత్త పడవచ్చు.

ఈ విధంగా కృష్ణ బిలంతో సాధ్యం కాదు. కృష్ణ బిలం చుట్టు కొలతకు మూడు రెట్లు దూరంలో దాని ప్రభావ గరిష్ట దూరపు హద్దు 'ఈవెంట్ హొరైజన్' ఉంటుంది.

నాసా శాస్త్రవేత్తల బృందం అయిదు 'కృష్ణ బిలాల'ను గుర్తించారు. ఈ కృష్ణ బిలాల పక్కనే తోటి నక్షత్రాలు ఉంటాయి. ఈ నక్షత్రాల నుండి వచ్చే పదార్థలు కృష్ణ బిలంలో పడిపోతాయి.

కృష్ణ బిలంలో ఈ పదార్థాలు వేగంగా లోనికి పోయేటప్పుడు ఇతర పదార్థాలతో ఢీకొనడం వల్ల ఎక్సు కిరణాలు విడుదలవుతాయి. ఈ ఎక్సు కిరణాల వలయాలను గుర్తించడం ఈ శాస్త్రవేత్తల పరిశోధనలలో ముఖ్యాంశం. అందుకే వారు కృష్ణ బిలాల ఉనికిని నిర్ధారణ చేస్తున్నారు.

## War and Peace

Though people have been at each other's throats forever, in early historic times there was no word for **war** in major Romance languages, the closest being German *werra* - confusion, discord. This later developed into the French war-word *guerre*, which spawned the freedom fighter, the **guerrilla** (literally : *little war)*. One of the guerrilla's preferred modes of attach is the **skirmish.** This word came from the Old german *skirm* ~ shield. Thus, it's related to the modern German word for umbrella~ *Schirm*, useful in the war against the elements. Another useful ploy is the **ambush**; as one might assume, this comes from *embushen*~ in the bushes. In early historic times, the Roman's word for war was *bellum*. As this was so similar to *bello* ~ beautiful, other nations resisted adopting it as a root word for their own wars. An exception was the architectural term **antebellum** ~ before the war, specifically the American Civil War. **Civil?** No civility there, just strife between private citizens, from Latin *civis*. But **peace** broke out in Roman times, too ~ *pax*. Alas, since **might is right,** there are many fighting words, but few for peace.

*- E Colin Williams, ARCA*

# మహాభారతం - రామాయణం

మూలం : డా॥ ఇరావతీ కర్వే

అనువాదం : డా॥ పెదపాటి నాగేశ్వరరావు

భారతరత్న ధోండోకేశవ్ కర్వే కోడలు ఇరావతీ కర్వే, పూనాలో డెక్కన్ కాలేజీలో సోషియాలజీ ఆంథ్రోపాలజీ శాఖలకు అధ్యక్షురాలుగా ఉండేది. మహారాష్ట్రలో బాగా సంపన్నమైన, అధికారయుతమైన కుటుంబంగా ప్రఖ్యాతం ఆమె పరివారం. 1965 నుండి సోషియాలజీలో పరిశోధనకోసం విద్యార్థిగా వెళ్ళిన డా॥ నాగేశ్వరరావుగారికి ఆమెతో కొన్ని సంవత్సరాల పరిచయం ఉంది. 1965లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ తరఫున తెలుగు మరాఠీ విద్యార్థిగా ప్రత్యేక ఫెలోషిప్పుతో పూనా విశ్వవిద్యాలయంలో నాగేశ్వరరావు ఉన్నప్పుడు ఆమెతో అనేక వాద వివాదాలనెదుర్కొనడం జరిగింది. ఆయన పరిశోధన సగంలో ఉండగానే ఆమె కన్నుమూసింది. దాంతో ఆయన మరలా స్వరాష్ట్రానికి వచ్చి పరిశోధనలు పూర్తికావించవలసి వచ్చింది. మహారాష్ట్రలో స్త్రీవాద రచయిత్రిగా ప్రఖ్యాతురాలైన ఇరావతీ కర్వే కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం కూడా పొందింది. 'యుగాంత' అన్న ఈమె మహాభారత పరిశీలనానికి తెలుగు అనువాదం గూడా వచ్చింది. ఈ గ్రంథం ఆధారంగానే 'మిసిమి' లోగడ కర్ణుడు, కుంతి, విదురుడు మొదలైన వ్యాసాలను ప్రచురించింది.

ఆమె కలం నుంచే జాలువారి, 'సత్యకథ' అనే మరాఠీ పత్రికలో ప్రచురితమైన 'మహాభారతం - రామాయణం' అనే బృహత్వ్యాసాన్ని మా పాఠకులకు అందించడానికి సంతోషిస్తున్నాం.

సంపాదకుడు.

కాలమానం ప్రకారం రామాయణ వ్యక్తులు మహాభారత వ్యక్తుల కన్నా నూరు, నూటపాతిక సంవత్సరాలు ముందటివారు. ( ప్రధాన్ - పర్గీటర్) రామాయణ కథావస్తువు మొదటిదీ మహాభారతం తర్వాతదీను. మహాభారతం చదివిన తర్వాత రామాయణం చదివితే మనకు భారత పాత్రల్లాగానే పరిచిత వ్యక్తులే అనిపిస్తారు.

రామకథ మహాభారతంలో వచ్చింది. దాంట్లో వాల్మీకి రామాయణం నుండి ఎన్నో శ్లోకాలు ఉన్నాయి. దీన్ని బట్టి రామాయణం మహాభారతం కంటే ముందే వ్రాయబడిందనీ, అలాగే మహాభారతంలో ముందున్న గయోపాఖ్యానంలో ఎవరో ఆధునికులు వాల్మీకి రామాయణంలోంచి శ్లోకాలు తీసి అందులో పొదిగారనీ చెప్పవచ్చు. అది ఎక్కడెక్కడ అంటే చెప్పడం కఠినం. కాని మహాభారత రచనకు పూర్వమే జనానికి రామకథ పరిచితంగానే ఉండేదనీ, దాన్ని పాడుకొనే వారనీ, ఆ జానపద గీతాల్నాధారంగా వాల్మీకి ఆదికావ్యం తయారు చేశాడనీ, తర్వాత ఆ శ్లోకాల్ని భారతంలోకి జొనిపి ఉంటారని తోస్తుంది. మహాభారత రామాయణాల్లో చాలా సామ్యాలున్నాయి. అలాగా విభేదాలూ విచారణీయాలే. చాలా సామ్యాలు బాహ్యాంగాల్లో ఉన్నాయి. మహాభారతంలో పెద్ద విభాగాల్ని 'పర్వా' లన్నారు. రామాయణంలో అదే అర్థంగల 'కాండం' అనే శబ్దాన్ని వాడారు. రెండు కథల్లోను రచయితలు పాత్రలుగా వచ్చే సంబంధం చూపబడింది. అంతకంటే ముఖ్యమైన విషయం

సామాజికమైంది. రెండు కథల్లోనూ హిందువులకు శ్రద్ధాపాత్రమైన పితృ ప్రాధాన్యత, బహు పత్నీకం, ఐక్య కుటుంబ పద్ధతీ, అనేవి ముఖ్యంగా చూపబడ్డాయి.

ఇక రెండోది సామాజిక స్వరూపం. అది ప్రాచీన హిందూ రాజ్య పాలనా పద్ధతివల్ల ఏర్పడింది. మహాభారతంలో ఎన్నో చిన్న చిన్న రాజ్యాలుండేవి. అది ఇప్పటి తాలూకాలంత కూడా ఉండేవి కావు. ఆరాజ్యాల్లో నగరం అంటే రాజధాని మాత్రమే. అందులో వంశపరంపరగా రాజ్యం చేస్తూ ఉండేవారే నివసించేవారు. అదే చిత్రం రామాయణంలోనూ ఉంది. అయోధ్య, మిథిల, అంగదేశంలో రోమపాదుడి రాజ్యం విశాల నగరం ఒకటికొకటి దగ్గరివే. రథంలో రాముడైనా, భరతుడైనా ఒకే రోజులో ఆ చివరి హద్దు చేరుకోగలడు. చెప్పుకోదగ్గ భేదం ఏమంటే మహాభారతంలో ఉన్న రాజ్యాలు - పెళ్ళీ - కుటుంబం - రాజకీయ సంబంధాలతో ముడిపడినై. లేక అదే కారణంతో విడివడ్డాయి. ఇది కథకు చాలా పుష్టినిచ్చింది. కాని రామాయణంలో ఈగొడవే లేదు.

రెండు గ్రంథాల్లోనూ కథానాయకులకు వనవాసం విధించబడ్డది. రెండు గ్రంథాల్లోనూ యుద్ధాలున్నాయి. ఒక పుస్తకం పూర్తిగా 'ఇతిహాసం' రెండోది 'కథ'. కృష్ణుడైనా, రాముడైనా అవతారమేనన్నారు. కాబట్టి అవతార సమర్థక వర్ణనలు తర్వాత గ్రంథాల్లోకి జొనపబడ్డాయి. మహాభారతంలో 'సంభవపర్వం' అంశావతారణం అనే వాటి నకళ్లు రామాయణంలోనూ కనిపిస్తాయి. ఇంకా చిత్రమైన సామ్యమేమంటే భృగువుల చరిత్ర ఆదిపర్వంలో చేర్చారు. రామాయణం బాలకాండలో విశ్వామిత్ర చరిత్ర ఉంది. కౌశిక వంశ విషయం చర్చింపబడింది. మూలకథతో దీనికి సంబంధమేలేదు. దివ్య దృష్టివల్ల సంజయుడు మహాభారత యుద్ధంలో జరిగింది జరిగినట్లు చూచి వ్రాశాడు. అలాగే వాల్మీకి దివ్యదృష్టితో చూసి రామాయణాన్ని వ్రాశాడు. రెంటిలోను శ్లోకాలు అనుష్టుప్పులే. భాషా విషయికంగా, వ్యాకరణ పరంగా ఎన్నో సామ్యాలున్నాయని మన దేశీయ పండితులూ, విదేశీ పండితులూ కూడా వివరించి వ్రాశారు.

కనపడే సామ్యతలకన్నా ఎన్నో భిన్నతలున్నాయి. మొదట్లోనే ఈ భేదం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ఒక అరణ్యంలో కూర్చొని మంత్రాలు వల్లించి. విసిగిన మునికి మహాభారతకథ వినిపింపబడింది. చెప్పేవాడు సూతుడు. అతడు మునీ పౌరాణికుడు కూడా. వంశాల చరిత్ర చెప్పడం అతని వృత్తి. అతని తండ్రి పేరు 'లోమహర్షణుడు' అంటే శరీరం గగుర్పొడిచేలా కథలు చెప్పేవాడని అర్థం. ఎదుటనిలబడి చెప్పేవారి పేరు 'ఉగ్రశ్రవస్' అంటే - ఆకర్షకంగా కంచు కంఠంతో వినిపించడం అనేది ప్రధానంగా ఉండేది. వాళ్ళు వీరాసనం వేసుకుని కథ చెప్పేవారేమో! తెలీదు. ఇది మరాఠీ 'పావాడా' లా ఉంది. అదే రామాయణ కథారంభ పరిస్థితి అయ్యుండవచ్చు. వాల్మీకి కథను వ్రాసి ఇద్దరు నాయకులకు నేర్పాడు, వాళ్ళపేర్లు 'కుశలవులు'. వాళ్ళు చిన్నవాళ్ళు, రూపసులు, బాగా పాడేవారు. బహుశా వాళ్ళకు తాళలయలు మాత్రమేగాక నాట్యం కూడా వచ్చి ఉంటుంది. వాళ్ళిద్దరూ అయోధ్యా నగరం వీధుల్లో పాడుతూ తిరుగుతుండగా భరతుడు చూచి రాముడి దగ్గరికి తీసుకొచ్చాడు. వాళ్ళు రామాయణం పాడడం మొదలెట్టారు. అది చాలా రమ్యంగా ఉంది. మహాభారతంలా నాలుగు రాజవంశాల కథ కాదు.

గాయకులు వీధుల్లో తిరిగిపాడుతుంటే జనం చుట్టూ చేరి వినడం అనేది మహానగరాల్లో కనిపించదు. కాని పూర్వం ఇలాంటిగాయకులుండేవారు. జైనుల గ్రంథాలు ఉత్తరాధ్యయన సూత్రాల్లో చిత్ - సంభూత్ అనే సోదరుల కథలున్నాయి. వీరి గాయన పద్ధతి మరాఠీ పావాడగాదు. లావణీకూడా కాదు. ఇంతకంటే మించిన జనరంజిక బాణీ అయి ఉంటుంది.

ఈ గాయకులు సీతా పుత్రులయిన కుశలవులని రామాయణంలో తెల్పబడింది. నిజానికి 'కుశలవు' లనేది స్వతంత్ర శబ్దం. మనుస్మృతి మహాభారత కాలంలో సాధారణ స్థాయి నాటకకారులు లేక గాయకులైన బ్రాహ్మణులని అర్థం. వీర్ని తద్దినాలకు పనికిరాని వారని కూడా చెప్పారు. వీళ్ళు జంటగా వృత్తి నిర్వహిస్తారు. రామాయణంలో 'కుశీలవౌ' అనే ద్వివచన శబ్దం కనబడుతుంది. రామాయణాంతంలో సీతా త్యాగ సందర్భంలో ఈ 'కుశలవులు' పాడారని ఉంది. కుశలవౌ అంటే లవకుశులని నిఘంటువు చెబుతుంది. హేమచంద్రుడు కూడా తన 'అనేకార్థసంగ్రహ' నిఘంటువులో ఇదే వివరించాడు. మేదినీ కోశమూ అదే చెప్పింది. వీటివల్ల ఈ సమస్య పెరుగుతుంది వాల్మీకియే రచయితా, గాయకుడు కూడానేమోననిపిస్తుంది.

వ్యాస వసిష్ఠ విశ్వామిత్రాది ఋషుల గురించి మనకు చాలా విషయాలు తెలుసు. కాని వాల్మీకిని గురించి ఏదీ లేదు. అతడొక మహా ఋషి అతడొక బ్రాహ్మణేతర కులానికి చెందిన వాడని చెప్పబడింది. హింసా రతుడై ఉండి కొన్నాళ్ళకు విరక్తుడై మహాఋషి అయ్యాడు. ఈ కథ సంశోధిత రామాయణ ప్రతిలో లేదు, ఏమైనా వాల్మీకి కుశలవ జాతికి చెందినగాయకుడనీ, దీనికో ఆధారముందనీ తోస్తుంది.

ఋషులు కులాల గురించి చర్చించకూడదు. అలాగే కవుల కులాల్ని గురించి కూడాను. వారినోటినుండి వెలువడ్డ శబ్దాలు కావ్యాలైతే చాలు. ప్రస్తుతం రామాయణం వ్రాసిన కవి గొప్ప మనీషి. అతడు స్నానానికి వెళ్ళినప్పుడు ఒక వేటగాడు క్రౌంచ పక్షుల జంటలో ఒకదాన్ని చంపాడు. జంటలేక ఆడపక్షి విలవిలలాడుతుండడం చూచాడు. వాల్మీకి మనస్సు అమితంగా బాధపడింది. వెంటనే వేటగాడ్ని శపించాడు. అతని నోటి నుండి వెలువడ్డ శబ్దాలు అప్రయత్నంగానే అనుష్టుప్‌లో ఉన్నాయి. అటనుండి వాల్మీకి తన ఆశ్రమానికి వెళ్లిన తర్వాత బ్రహ్మదేవుడు స్వయంగా అతడ్ని కలవడానికి వచ్చి 'కావ్యం' వ్రాయమని ఆదేశించివెళ్లి పోయాడు. అంతకుముందే నారదుడు వచ్చిలోకంలో ఉత్తమ పురుషుడైన అయోధ్య రాముడెలా ఉండేదీ వర్ణించి చెప్పాడు. రామ చరిత్ర అంతా వాల్మీకికి తెలుసునని బ్రహ్మవాక్యం. వాల్మీకి తన కాలంలో ఉన్న రాముడ్ని గురించి కావ్యం వ్రాశాడు. మహాభారతంలో యుద్ధవిషయాలు వ్రాసిన సంజయుడు రణరంగానికి వెళ్లేవాడని ఉంది. కాని వాల్మీకి తన ఆశ్రమం గడప దాటకుండానే కావ్యం వ్రాశాడు. కేవలం సీతా త్యాగానంతరం మాత్రమే రాముని కొలువు చూశాడు.

కవితాస్ఫూర్తితో వెలువడ్డ కావ్యం రామాయణం - శోకమే శ్లోకమైంది. రామకథ అంటే సీతకథే. ఇది ప్రజల్లో బాగా ప్రచారం పొందింది. దుఃఖాకులమైన క్రౌంచ వధ చూసి వ్రాసిందే గదా!

ఇలాంటి లౌకిక కథలు చాలా విని వాల్మీకి యీ పెద్ద కథను వ్రాశాడనిపిస్తుంది. మహాభారతమంటే

నాల్గైదు తరాల కథ కదా! రామాయణం జానపద కథల మిశ్రణం. అందువల్లే ఇది భారతం కన్నా ఎక్కువ భేదంతో ఉంది.

(రామాయణంపై ఫ్రెంచి జర్మన్‌పండితులు చాలా కృషిచేశారు. వాటిలో కొన్నిటిని డా. సుక్తాంకర్ వ్యాసాలు, రామాయణ సంశోధిత ప్రతిలో సంపాదకులు ప్రతికాండం మీద ఇచ్చిన ప్రస్తావనలు, వాటిని చదివిన తర్వాత నేను శోధించినవీ ఆధారంగా ఇది వ్రాస్తున్నాను. కీ.శే. భాస్కర్‌రావ్ జాధవ్ చాలా కాలంక్రితమే రామాయణంమీద పరిశోధనా వ్యాసాన్ని ప్రచురించాడు. వాటిని చూచాను కాని ఇప్పుడవి నాదగ్గర లేవు.)

మహాభారతం చరిత్ర - రామాయణం కావ్యం ఇదే వీటి భేదం. రామాయణం కన్నా మహాభారతం కథ పెద్దది. శాంతి, అనుశాసన పర్వాల్లో తప్ప కథ ఎక్కడా తెగదు. అలా చూస్తే రామాయణం పరిస్థితి వేరు. బాలకాండం చాలా ప్రక్షిప్తం. అయోధ్యాకాండలో కథ చకచకా నడుస్తుంది. తర్వాత కాండాల్లో ఆసక్తికరంగా ఉండదు. కావ్యమూ - చమత్కృతీ బాగుంటుంది. మహాభారతంలో మొదటి నుండి చివరి వరకూ సంఘర్షణే. కుటుంబానికి సంబంధించిందే. మానవ సహజంగా ఉంటుంది. రామాయణంలోనూ మొదట అలానే ప్రారంభమైంది. కాని రాముడు భరతుడు చేసిన పనులవల్ల కథకు పుష్టి కలిగింది. తండ్రిమాట నిలబెట్టడానికి రాముడు వనవాసానికి ఒప్పుకున్నాడు. అప్పుడు భరతునికి రాజ్యం రావాలి కదా! కాని భరతుడు దాన్ని అంగీకరించడు. స్వయంగా అగ్నికి ఆహుతి అవుతానని తయారౌతాడు. రాముడు రాజ్యం స్వీకరించడు. భరతుడు సింహాసనమెక్కడు. ఇదో చిక్కు సమస్య. చివరికి రాముని పాదుకలకు పట్టాభిషేకం. ఏ భోగమూ అనుభవించక, రాముడు తిరిగివచ్చేవరకూ రాజ్యభారము వహిస్తానని భరతుడు అంగీకరించడం వల్ల సమస్య తీరింది. ఇద్దరు లోకోత్తర పురుషుల ప్రతిజ్ఞాపాలన జరిగింది. ఇలా అయోధ్యాకాండలో మొదలైన సంఘర్షణ - కావ్యాంతంలో ముగుస్తుంది. సమస్య ప్రారంభమైనా కథలో మునిగిపోయినట్లనిపిస్తుంది.

ఒకరితో ఒకరి పోటీయో - పేచీయో లేకపోతే కథేముంది! అరణ్యకాండ నుండి కథ ఒక క్రొత్త మార్గంలో నడుస్తుంది. సీతాపహరణంతో సమస్య ప్రారంభమౌతుంది.

కిష్కింధ కాండలో వాలి సుగ్రీవుల జగడాలు. రాముడు సుగ్రీవుని మైత్రి కోరడం కథకొక శోభను తెచ్చి పెట్టింది. ఈ ఉపకథ ఈ కాండంలోనే ముగుస్తుంది. అరణ్యకాండంలో ప్రారంభమైన సమస్య యుద్ధ కాండలో పరిష్కరింపబడుతుంది. కథ కొంతవరకు ముగుస్తుంది. సీతాత్యాగంతో మరో సమస్య ప్రారంభమౌతుంది. అదో ప్రత్యేక కాండ గదా! ఇది తర్వాతి కాలంలో జోడింపబడ్డది. రామాయణం మొదటి భాగమంతా మానవ సహజ సమస్యలకు సబంధించిందే. రెండో భాగం చెట్లూ కోతుల కథలే. మూడో భాగంలో రామలక్ష్మణులు సీత మాయావులైన రాక్షసులు చెట్లూ, కోతులే ఉంటాయి. అరణ్య కాండలో ఋషుల ఆశ్రమాల సందర్శనం ఉంటుంది. దీంట్లోనే ఒకటి రెండుసార్లు ఇంద్రుడు వస్తాడు. ఇది బౌద్ధ కథల్లా ఉంటుంది. ఈ కథ జరిగిన ప్రాంతం ప్రక్కనే బౌద్ధ జైనాలు పుట్టాయి గదా! వాటి ప్రభావం వాల్మీకి పై ఉంది. అహింసా ప్రవచనం రెంటిలోనూ చోటు

చేసుకున్నది. భారతంలో పశువుల్ని కట్టెతో కొట్టినా, మేపుతూ, జాగ్రత్తగా చూసుకోమని ఉంది. - రామాయణంలో రామలక్ష్మణులు వేటకువెళ్లి ఆహారం సంపాదించేవారని ఉందిగదా! కాని మధ్య మధ్య అహింసా ప్రవచనాలున్నాయి. అవి సీత చెప్పినవే. రాముడ్ని ధనుస్సు క్రింద పెట్టమంటుంది. ఇది ఒకరకమైన చాపల్య సంభాషణ. ఇలా కొంత బ్రాహ్మణీకరణ కనిపిస్తుంది. ఉదయం, సాయంత్రం, రాముడు సంధ్య వార్చినట్లు ఉంది. కాని భారతంలో పాండవులుగాని, కౌరవులుగాని, యాదవులుగాని ఇటువంటివేమీ పట్టించుకొన్నట్లు కనిపించదు.

రామాయణంలో కుబ్జలకు స్థానం చూపబడింది. తర్వాత పురాణాల్లో ఎక్కడా వీరి జోలిలేదు. మహాభారతంలో హస్తినాపురానికి పాండవులు రాజులయ్యారు. వారి తర్వాత పరీక్షిత్తు రాజయ్యాడు. తర్వాత జనమేజయుడు వచ్చాడు. అలా వంశపారంపర్యం కొనసాగింది. హస్తినాపురంలో ఏ కొట్లాట జరిగినా రాజ్యాలకోసమే జరిగింది. కొన్ని వందల సంవత్సరాల తర్వాత దీన్ని విడిచిపెట్టాల్సి వచ్చింది. అప్పుడు కౌశాంబిని రాజధానిగా చేసుకొన్నారు. అయోధ్య తరతరాలుగా ఇక్ష్వాకుల రాజధాని. మనువు మొదలుకొని ఎందరెందరో పెద్ద పెద్ద రాజులు ఇక్కడ నుండి రాజ్యం చేశారు. రాముడితో యీ పరంపర నశించింది. అంతకు పూర్వం ఎప్పుడూ వినబడని 'సాకేతం'గా మారిపోయింది. రామలక్ష్మణ భరత శత్రుఘ్నుల కొడుకులు వేరు వేరు ఊళ్లు రాజధానులు చేసుకొని పాలించారు. రాముని సంతానం రాముని సింహాసనం ఎందుకు ఎక్కలేదు? రాముని తర్వాత అయోధ్య బీడుపడిపోయిందని కొందరు వ్రాశారు. రాముడితోపాటు ప్రజలంతా స్వర్గానికి వెళ్లినందుకలా జరిగిందా? ఈ వర్ణన ప్రక్షిప్తంగా తోస్తుంది. అయోధ్య పాడుపడి కొన్నాళ్ళకు అక్కడే సాకేతం పుట్టిందనేది సత్యం - అలా ఎలా జరిగిందనే దానికి ఎక్కడా దాఖలాలు లేవు. రాముడు తన పిల్లలకు వేరే రాజ్యమిచ్చాడని. వర్ణనలున్నై అలా ఎందుకని? ఇదీ రహస్యమే. కృష్ణుని ద్వారక అతనితోనే పోయింది. కృష్ణుని వినాద్వారకతో ఎవరికీ సంబంధం లేదు. అయోధ్య అలాంటిది కాదు. పరంపరగా వస్తున్న పుణ్యవంతుల రాజధాని. ఎలా నశించింది? ఎందుకు నశించింది? ఇది పరిశోధించాల్సిన అంశం. మహాభారతంలో కథాసూత్రం ఒకటిగాలేదు. స్వభావాల వర్ణన వల్ల ఒక క్రొత్తరూపం తయారౌతుంది. రాజుకు యిద్దరు పుత్రులు పెద్దవాడు గ్రుడ్డివాడు కాబట్టి ప్రక్కకు పెట్టారు. చిన్నవాడే సింహాసనమెక్కాడు. ఐనా అనుభవించలేకపోయాడు. ఇద్దరిపిల్లలూ ఒకే అంతఃపురంలో పెరిగారు. వాళ్ళ సామాజిక, కౌటుంబిక పార్శ్వ గుణాల వల్ల ఒకరితోనొకరు గొడవపడేవాళ్ళు. వాళ్ళతో పాటు వాళ్ల చుట్టూ ఉన్న బంధు మిత్ర పరివారమంతా కలతలతో ఉండేవాళ్లు. కథ అంతా జగడాలమయమే. చిన్నప్పటి కలతల తోనే చంపుకోవాలనే ఉద్దేశం ఉండేది. లక్క ఇంటినుండి పాండవులు బైట పడ్డ తర్వాత ధృతరాష్ట్రుడు వాళ్లకు కొంత రాజ్యాన్ని ఇంద్రప్రస్థాన్ని ఇచ్చాడు. దాంతో కొంత శాంతించారు. కాని మానసికవైరాలు పోలే! ఇంద్రప్రస్థంలో యజ్ఞం చేసి వాళ్లు ప్రతాపం చూపించాలనుకున్నారు. దాంతో మళ్లీ వైరం రాజుకుంది. అరణ్య పర్వం తర్వాత కృష్ణుని రాయబారమూ, సంధీ ఫలించినా ఇంద్రప్రస్థం సమస్య మళ్లీ తలెత్తేదే! ప్రతి ఒక్కరూ వైరం పెరగడానికి తమవంతు పాత్ర పోషించిన వారే. అలా చేయనివాళ్ళు బలహీనులు. కథ చివరిలోని మహాయుద్ధానికి కావలసిన బీజాలు మొదటి నుండే దర్శనమిస్తూనే

వచ్చాయి. దాన్ననుసరించి సంబధిత వ్యక్తులు అంతమవుతూ పోతారు. ఇవే మహాభారతానికి ఉన్న చణుకులు.

దీనికి వ్యతిరేకం రామాయణం కథ. ప్రారంభంలో భారతంలాగానే కనిపించినా, కుటుంబ కలతలు లేకపోయినా, సంఘర్షణ ఉంది. భరతుడు రాముడ్ని చూడడానికి వస్తుంటాడు. దూరం నుంచి లక్ష్మణుడు చూచి వీడు రాముడ్ని చంపడానికి రావడం లేదుకదా! అడవిలో ఉన్నా బ్రతికి ఉంటే ఏమో! అనుకొని చంపడానికి రావడం లేదుకదా! అని అంటాడు. దీన్ని విన్న తర్వాత మనకు ఆశ్చర్యం కలుగుతుంది. భరతుని చరిత్ర ముందు విన్నదే. ఇద్దరూ కల్సిన తర్వాత వేర్వేరు ప్రతిజ్ఞలు చేస్తారు. పాదుకా పట్టాభిషేకం తండ్రికి ప్రాధాన్యత. ఎక్కువ భార్యలుంటే వచ్చే సమస్యలు ఈ కథలో ఉన్నాయి. అన్నదమ్ములు కుమ్ములాటకే కాక త్యాగానికీ నిలుస్తారని రామాయణం ద్వారా తెలుస్తుంది. మహాభారతంలో ఒకరినొకరు చంపుకునే ఉపాయాలున్నై. రామాయణంలో ఒకరినొకరు ప్రేమించుకునే కళాత్మకత ఉంది. రామాయణంలో అందంగా ఉండే విషయాలివే. తర్వాతవచ్చే కథలకు మూలకథతో సంబంధం ఉండదు. స్వర్థ - సంఘర్షణలకు - ఉదారతతో వాటి నివారణ అనేవి ఇక్కడున్నాయి. ఇది మహాభారతంలో లేవు. కొట్లాటల మధ్య కథా రంజకంగా సాగుతుంది. కాని రామాయణంలో సంబంధం లేని కథలు మళ్లీ మళ్లీ చెప్పుతున్నందున నిష్ప్రయోజనాలుగా ఉంటై ఇది రెండో విభేదం.

## అయోధ్యా కాండ

**రామవనగమనం.**

రామాయణం అన్ని కాండలకన్నా కథా దృష్టితో చూస్తే అయోధ్యకాండ ఉత్తమమైంది. ఇందులో కథ చకచకా నడుస్తుంది. స్థలకాలాన్ని బట్టి చూస్తే కథ ఒక పట్టణంలోనే జరుగుతుంది. కొద్ది భాగం రాజ్యం బైట, కొంతగంగకు దక్షిణ తీరాన జరుగుతుంది. మొత్తంగా చూస్తే యాప్రదేశం పెద్దదేమీకాదు. కాలందృష్ట్యా చూస్తే - దశరథుడు సభను సమావేశ పరచిన దగ్గరనుండి చిత్రకూటంతో అన్నదమ్ముల కలయికతో ముగుస్తుంది. ఈ కాండం పరిష్కరించిన నాగేశపండితులు (1700 - 1750) వ్రాసిన 'తిలక' వ్యాఖ్య ప్రామాణిక మన్నారు. నేనూ దాన్ని అంగీకరిస్తాను. దాంట్లో - చైత్రశుక్ల దశమ్యాం రామస్య ప్రస్థానమ్! ఔర్ధ్వదేహికేన పక్షోగతః! ఏవం వైశాఖోగతే, జ్యేష్ఠే భరతస్య చిత్రకూటం ప్రతిప్రస్థానం అగ్రే వర్షాకాలే సన్నిహితే సతి కార్తిక్యంతం చిత్రకూటే రామస్యవాసః!

చైత్రశుక్ల నవమికి రాజ్యాభిషేకం ప్రకటించబడింది. కార్యక్రమం దశమి నాడు జరగాలి. ఆరోజేకైక వరం అడిగినందున రాముడు వనానికి పోయాడు. తర్వాత ఐదు రోజులకు అంటే పౌర్ణమినాడు దశరథుడు మరణించాడు. భరతుడు అయోధ్యకు రావడానికి పక్షం (15) రోజులు పట్టింది. దశరథుని ఉత్తర క్రియలతో మరో పక్షం (15) రోజులు గడిచాయి. నాగేశుడు (వ్యాఖ్యాత) చెప్పిన ప్రకారం వైశాఖం అలా గడిచిపోయింది. ఆ లెక్క ఉత్తరదేశంలో ఉన్న పౌర్ణిమాంత మాస వ్యవహారంలా

ఉంది. దశరథుడు చనిపోయిన రోజుకు చైత్రం ముగిసింది. జ్యేష్ఠమధ్యంలో భరతుడు రాముడ్ని కలవడానికి వెళ్ళాడు. వెళ్ళేవాడు రాజమాతలందర్నీ కూడా తీసుకెళ్ళాడు. అందువల్ల అతనికి వారమో వారంన్నరో పట్టి ఉండవచ్చు. అన్నదమ్ములు కలుసుకొని, తన్మయులై, సంభాషించుకొన్న తర్వాత భరతుడు తిరిగి వచ్చాడు. అప్పటికి జ్యేష్ఠమాసం వచ్చేసింది. వర్షాకాలంలో ప్రయాణం కష్టమనుకొని రాముడు కార్తీకపూర్ణిమ వరకూ చిత్రకూటంలోనే బసచేశాడు. భరతుడు తిరిగి వెళ్లాడు. ముఖ్యకథ చైత్ర నవమినుండి పూర్ణిమ వరకు ఆరురోజులూ, మొత్తం వైశాఖం ముప్పైరోజులు జ్యేష్ఠంలో మొదటి పదిహేనురోజులు కలిసి ఒక నెల, ఇరవై యొక్క రోజుల మధ్యే జరిగింది. ఒకదాని వెంట మరొకటి తొందర తొందరగా జరిగిపోతాయి. చదవడానికి విసుగురాదు. కథ మాత్రమే గాక కథనంలో కూడా మనుష స్వభావాలు చక్కగా ప్రతిబింబించాయి. భరతుడు శత్రుఘ్నుని తీసుకొని మామలతో తాతగారింటికి పోవడంతో అయోధ్యాకాండ ప్రారంభమౌతుంది.

భరతుడు వెళ్ళిన తర్వాత దశరథుడు రామునికి యౌవరాజ్యాభిషేకం చేయాలని నిర్ణయించాడు. ఎంతో తొందరగా - మొదటి నుండీ ఆయనకో శంక వెంటాడుతూనే ఉన్నందున ఐనా అన్నీ సరళంగా లేవు. దశరథుడు మహాసభ ఏర్పాటు చేసి ప్రజలకూ, సామంతరాజులకూ తన మనోగతం వినిపించాడు. రాముడు సుగుణాభిరాముడుగాబట్టీ - పట్టపు దేవేరి కొడుకు గాబట్టీ - ఆ ప్రతిపాదన అందరికీ పసందయ్యింది. నాకెందుకో దుఃస్వప్నాలు వస్తున్నాయిగాబట్టి, ఈ కార్యం తొందరగా పూర్తి చేయాలి అని దశరథుడు రాముడ్ని పిలిచి యీ విషయం వెల్లడించాడు రాముడూ సంతోషించి ఈ వార్త తల్లికి చెప్పడానికి వెళ్ళాడు.

యువ రాజ్యాభిషేకం ఒక పెద్ద ఉత్సవం. శుభకార్యమూను. తలంపుగానే ఏర్పాట్లు చేశాడు రాజు. రాముడితో తన అశక్తత, భీతి, మొదలైనవి చెప్పడం చూస్తే కొంత ఆశ్చర్యంగా ఉంటుంది. సభముగించి రాజు అంతఃపురానికి వెళ్ళి రాముడ్ని పిలిపించి మాట్లాడుతాడు. దశరథుడిలా అన్నాడు:

> విప్రోషితశ్చ భరతో యావదేవ పురోదితః
> త్వదేవాభిషేకస్తే ప్రాప్తకాలా మతో మమ॥ 2.4 - 25
>
> కామం ఖలు సతాం వృత్తే భ్రాతాతే భరతః సుతః
> జ్యేష్ఠానువర్తీ ధర్మాత్మా సానుక్రోశో జితేంద్రియః॥ 2.4. 26
>
> కింతు చిత్తం మనుష్యాణామ నిత్యమితిమేమతిః
> సతాంచ ధర్మనిత్యానాం కృతశోభి చరాఘవ॥ 2.4 - 27

భరతుడు ఊళ్లో లేనప్పుడే నీ అభిషేకానికి మంచిది. భరతుడు సజ్జనుడే తండ్రిమాట జవదాటనివాడే, ధర్మాత్ముడు, దయాళుడు, స్వస్థచిత్తుడును, మనుష్యుడెంత ధర్మాత్ముడైనా, సత్ప్రవృత్తియైనా మనసు చంచలమైంది సుమా ఎప్పుడు ఎక్కడ ఎలా మారుతుందో చెప్పడం కష్టం.!

అని దశరథుడంటాడు. రాముడు నిశ్శబ్దంగా వింటాడు. తల్లికడకేగి పట్టాభిషేకానికి కావాల్సిన ఉపవాస విధుల్ని గురించి మాట్లాడుతాడు. దశరథుడు ఏం చేయాలో అది చేశాడు. రాముడ్ని యువరాజును చేయడానికి. కాని అతడు భరతాది అన్నదమ్ముల్ని పిలిచి తాను చేయదలచుకొన్నది చెప్పి ఉండవల్సింది. దశరథుడు భార్యలకు చెప్పలేదు. అదితప్పే. కాని రాముడెందుకు అంగీకరించాడో తెలియటంలేదు! అతడు చెప్పిన వెంటనే ఒప్పేసుకొన్నాడు. ఎందుకని? తండ్రిమీద భక్తి చేతనా? పిన్నతనంచేతనా? (అప్పుడతని వయసు 17 సం. లు మాత్రమే).

రాముడీ విషయం కౌసల్యకు చెప్పడానికి వెళ్ళాడు. అప్పుడామె విష్ణుపూజ చేస్తుంది. అది జనార్ధన (2.4. 33) పూజ అన్నారు. తర్వాత ఆరో అధ్యాయంలో 'నారాయణ' పూజ (2.6.1) అన్నారు. రాముడు ఉపవాసంచేసి విష్ణువు ఆయతనం (2.6.4)లో ఉన్నాడని వ్రాశారు. రామాయణం చదువుతుంటే ఏదో ప్రాచీన కథ చదువుతున్నట్లనిపించదు. అంటే యీ విషయాలన్నీ తర్వాతి కాలంలో జొనపబడ్డవేమో? కౌసల్య ప్రక్కన సుమిత్ర ఆప్రక్కన చేతులు జోడించుకుని లక్ష్మణుడూ ఉన్నారు. లక్ష్మణా నాలాగే నీవు రాజ్యంచేయి. నీవు నారెండో ఆత్మవు. నీకీ లక్ష్మి ప్రాప్తించింది! అన్నాడు రాముడు.

నిజంగా ఆలోచిస్తే ఆ సమయాన రాముడికి భరత శత్రుఘ్నులు జ్ఞాపకం రావాల్సి ఉండెగదా! ఆ యిద్దరు కాకపోయినా నాల్గురూ రాజ్యమేల్దాం అని కూడా అనడు - లక్ష్మణుడు సహజంగా ఆయనకు సహచరుడు అయినప్పటికీ తక్కిన యిద్దరూ ఆయన సోదరులే కదా! జీవితాంతం చేసిన తపస్సు ఫలించింది. - పూజ ఫలించింది అని ఆనందంతో అనుకుంది కౌసల్య.

ఆ విషయం చెప్పడానికి రాత్రి దశరథుడు కైకదగ్గరికి వెళ్తాడు. మంధర సూచనలవల్ల ఆమె ముందే అలక పాన్పెక్కింది. దశరథుడు రామ పట్టాభిషేక విషయం వెల్లడించగానే క్షణంలో ఊరంతా ప్రాకిపోయింది. కాని కైకేయీ సేవకపరివారానికి తెలియలేదా! మంధర మేడ మీదకెళ్లి చూచినప్పుడు ఊరు అలంకరించడం గమనించి కారణం తెల్సికొంది. ఎప్పుడూ ఏ పనీ చేయని కౌసల్య ఆనందంతో పైసలు పంచుతుంది. రాముని సేవకి ద్వారా విషయం తెలుసుకొన్న మంధర కైకేయి దగ్గరకు పోయి - అంతా సర్వనాశన మవుతుందే మూర్ఖురాలా పడుకొన్నావే? కైక నిర్లిప్తంగా ఇందులో బాధపడవలసిన దేముంది? అన్నది. రాముడు కౌసల్య కంటే నన్నే బాగా ప్రేమిస్తాడే. రాముడు 100 సంవత్సరాలు రాజ్యమేలిన తర్వాత భరతుడు రాజవుతాడుగా అంటుంది. కైకేయి మాటలకు ఆశ్చర్యపోతుంది. నేపాల్‌లో అన్న తర్వాత తమ్ముడు రాజవడమనే ఆచారం వుంది. అలాగే చిన్న తమ్ముడు యువరాజంటారు. (మహావంశమనే బౌద్ధగ్రంథంలో ఈ విషయం ప్రస్తావన ఉంది).

మంధర కైకేయికి నూరిపోయటం ప్రారంభించింది. రాజకుమారులంతా గద్దెక్కుతారా! రాముని తర్వాత అతని కొడుకు రాజౌతాడు గాని అతని తమ్ముడు కాడు కదా ఇది మనకు అనర్థమే గదా! భరతుడు ఇప్పుడు యిక్కడే ఉండాల్సింది. అనవసరంగా అమ్మమ్మగారి ఊరు పంపావు గదా! అని

(ఇంకా ఉంది)

# వేదార్థ సారం

- శివలింగం

వేదాలు మనకు తెలిసినంత వరకు మూడు విశాల భాగాలు - సంహిత, బ్రాహ్మణ, ఉపనిషత్తులు. కర్మకాండ, జ్ఞానకాండ రెండుగా ప్రాచుర్యం. బ్రాహ్మణాలను అనుసరించే వారిని వేద వాదులుగాను, ఉపనిషత్తులననుసరించే వారిని బ్రహ్మవాదులుగాను ప్రచారంలో వుంది, వేదాల్లో ఋగ్వేదం అతిప్రాచీనం, వేదాలన్నిటిని సమన్వయ దృక్పథంలో అవగాహన చేసుకోవాలి. వేదాలను శ్రుతి అనడం సరికాదు. అలౌకిక కవిత్వం. అప్రయత్నంగా వెలువడే దివ్య వాక్కు కవిత్వం. ఋగ్వేదంలోని ఋక్కులన్ని మంత్ర ద్రష్టలు పురుష ప్రయత్నం లేకుండానే వెలువడి నాయి గనుక అవి అ పౌరు షేయాలు. క్రౌంచ మిధునంలో మగపక్షిని బోయవాడు కొట్టగటా పెంటి పక్షి దుఃఖంతో విలవిలలాడు తుండగా దాని శోకాన్ని చూచి వాల్మీకి దుఃఖితుడై ఆ కిరాతుడిని శపించాడు. ఆ శాపాక్షరాలు శ్లోక రూపాన వెలువడినాయి. ఆశ్రమానికి వచ్చినాక అంతర్ముఖుడైనపుడు మనశ్చక్షువుకు బ్రహ్మ కనిపించి నా కోరిక వల్లనే దివ్య వాక్కు ప్రవహించిందన్నాడని కథనం. రవీంద్రుడు కూడా ఒక గీతంలోని గూఢంగా వున్న మనో దేవల పలికిస్తుంది. నేనొక ఉపకరణం మాత్రమేనంటాడు. మధుచ్ఛందుడు అగ్నిని చూచి అప్రయత్నంగా పలికిన వాక్కులు కూడా అంతే. వాక్కుకు దివ్యత్వం కవిత్వం తోనే సిద్ధిస్తుంది. వేదవాక్కు బ్రహ్మవాక్కు అంటారు.

'కవీయమానఃకః ఇహ ప్రవచద్ దేవం మనఃకుతో అధి ప్రజాతం' అని ఋషి దీర్ఘతముడు చెప్పాడు. దివ్యత్వ స్థితిలో పలికింది కనుక నిగూఢంగా వుంటుంది కవిత్వం. వేద ఋషి శాశ్వత సత్యాలను, విశ్వ రహస్య సూత్రాలను సృష్టిస్థితి లయాలను మనోచక్షువు ద్వారా అంతర్దర్శన చేశాడు. భావ చిత్రాలు, ప్రతీకలు, పదాలతో వ్యక్తీకరించాడు. అగ్ని, ఇంద్రుడు, వాయువు, సూర్యుడు, వరుణుడు, సవిత, ఉషస్సు, అప్, యూప, ఉలూఖలముసల మొదలైన వారంతా దేవతలు. దేవ అంటే వెలుగు, దేవత అనేది ప్రతీక. (దేవంతనొతీతి దేవతా). సత్య దర్శనం చేసిన ఋషి పౌరాణిక ప్రతీకలతో వ్యక్త పరుస్తాడు. క్రీ.శ. ఆరవ శతాబ్దం వరకు వేదాల మీద భాష్యం రాలేదు. కవిత్వం అనువదించడం కష్టం. వేదాన్ని సంతృప్తి కరంగా అనువదించినవారు లేరు. పృధ్వి, క్షితి వంటి పదాలకు భిన్నార్థాలు కనిపిస్తాయి. క్షితి పదానికి ఆశ్రయం, స్థిరత్వం, శాంతి అర్థాలలో కనిపిస్తుంది.

వేదాలకు సాయణుడు, వెంకటమాధవ, యాస్క, మాధ్వాచార్య, జయతీర్థ, పాశ్చాత్య పండితులు వ్యాఖ్యానాలు వెలయించారు. ఆధ్యాత్మికంగా, కర్మకాండగాను, బహు దేవతారాధన, అద్వైత పరంగాను ఎవరికి అభి మానమోదాన్ని వేదం చెప్పిందన్నారు. అరవిందుడు ప్రతీకాత్మక, నిగూఢ కవిత్వంగా భావించి వేద రహస్యాలు వివరించారు. విభిన్న వ్యాఖ్యానాలకు తావిచ్చింది వేదం. ఋగ్వేద సూక్తాలు రహస్య ప్రార్థనలు రహస్యాని స్తోత్రాని. **(Mystical prayers)** నిన్యావచంసి రహస్య ప్రకటనలు.

---

**శ్రీ శివలింగం,** చల్లపల్లి, వీవర్స్ సొసైటీలో పనిచేసి రిటైర్ అయ్యారు.

యజ్ఞ కర్మల సాంకేతిక వివరణ బ్రాహ్మణాలు, అరణ్యాకాలు, భగవద్గీతల్లో కనిపిస్తాయి. వృత్ర- తమస్సు, వజ్ర - వివేకం అని అర్థం చేసుకోవాలి. ఇతర వ్యాఖ్యానాల మీద ఆధారపడకుండా స్వయంగా చదివి ఎవరికి వారు అర్థం చేసుకోడానికి ప్రయత్నించాలి. వేదం మొత్తం మానవాళికి సంబంధించిందే గాని ఒక వర్గానికి కాదు. సంహిత, బ్రహ్మణాల్లో గాని, ఉపనిషత్తుల్లోగాని జాతి కుల లింగ వివక్షత చెప్పబడలేదు. అందరూ చదవచ్చు, లబ్ధి పొందవచ్చు, శ్రుతి సత్య ధర్మాలను మనకు ప్రసాదించింది. ఏది విశేష ధర్మమో తర్కం ద్వారా తెలుసుకుంటాం. భారతీయ సంప్రదాయంలో మానవ స్వేచ్ఛను, ఆలోచనను, కర్మను నిరోధించే పరిపూర్ణ అధికారిక ప్రామాణికత ఏదీ లేదు. శ్రుతుల మీద అనేక వ్యాఖ్యానాలు వచ్చాయి. సర్వే వేదా యత్రైకంభవంతి. వేదాలన్నీ ఒక్కటే, యజ్ఞం అంటే పరమాత్మ కోసం చేసే తపస్సు. సంహితలు, బ్రాహ్మణాలు, అరణ్య కాలు ఈ విషయాన్నే చెపుతున్నాయంటారు.

గృహస్థు పంచ మహాయజ్ఞాలు రోజూ చేయాలి. సర్వ భూత హితం కోసం బ్రహ్మయజ్ఞం, దేవయజ్ఞం, పితృయజ్ఞం, అతిధి యజ్ఞం, భూతయజ్ఞం. వీటి అర్థం వ్యక్తి చైతన్యం నుండి విశ్వ చైతన్యంకు వికసించడం, ప్రకృతి శక్తులతో విలీనం కావడం, ప్రకృతికి హాని కలిగించకుండా ఉండటం, మానవ సమాజానికి వారసుడుగా వుండటం, సహజ స్వార్థవాంఛను అణచడం జీవించడం, జీవించనీయడం యజ్ఞ ఫలం అందరికి మంచి జరగడం. మనం జీవించేది మన కోసమేకాదు సర్వ ప్రాణుల కోసం, భగవంతుని కోసం. యజ్ఞం ఒక ఉన్నతమైన ఆశయ సాధన కోసం నిర్వహించేది.

పురాణాలు, ఇతిహాసాలు వేద సత్యాలను వివరించి చెపుతాయి. సూక్ష్మంగా వేదసూక్తాల్లో చెప్పింది ఉపనిషత్తుల్లో స్థూలంగా కనబడుతుంది. కోనోపనిషత్తు నాలుగు అధ్యాయాల్లో చెప్పింది ఋగ్వేదంలో వాక్సూక్తం **(x-125)** ఎనిమిది శ్లోకాల్లో చెప్పబడింది. బ్రహ్మ జిజ్ఞాస, ధర్మజిజ్ఞాస, తత్వ జిజ్ఞాసలకు సమాధానాలు వేదాలు చెపుతాయి కవితాత్మకంగా. గీతలో పదహారవ అధ్యాయం దేవాసుర సంపద ఋగ్వేదం 7-104లో వాసిష్ట ఋషి చెప్పిందానికి అదనంగా కొత్తగా చేర్చిందేమీ లేదు.

**వేద తాత్పర్యం ఏకం సత్**

యజ్ఞం వేదకాల జీవితానికి, ఆలోచనకూ, సంస్కృతికి కేంద్ర బిందువు. వైదిక కర్మకాండను గురించి ఆలోచిస్తే ఆనాడు జీవితం సుఖమయంగా వుండాలని కోరుకున్నారు. విధి నిషేధాల్లేవు. యజ్ఞంలో పశుబలి వుందనడానికి సాక్ష్యం వుంది. అయితరేయ బ్రాహ్మణం 6వ ఖండ 6వ అధ్యాయంలో 'పశుర్వైనీయ మానః సమృత్యుం ప్రాపస్యాత్స... ఇత. వేదాల్లో ఏమీ లేదనండం గాని అన్నీ వున్నాయనడం రెండూ పాక్షిక సత్యాలే. గొప్ప సంపదను యిచ్చారనడంలో సందేహం లేదు. ఋగ్వేదంలోని రెండు వేల శ్లోకాలను పరిశీలించి ఋగ్వేదార్యులు గ్రంథం రాశాడు రాహుల్‌సాంకృత్యాయన్. ఆనాటి జీవిన విధానాన్ని చారిత్రకంగా వివరించాడు. వేదాల్లో దార్శనిక చింతన బలంగా లేదన్నాడు. మార్క్సిస్టు అధ్యయనం. దేవి ప్రసాద్ చటోపాధ్యా కూడా వేదాలను మార్క్సిస్టు అధ్యయనంతో వ్యాఖ్యానించాడు. కృష్ణన్‌రాజా పదేళ్లు పరిశ్రమ చేసి వేదాలమీద ఉపన్యాసాలు యిచ్చాడు.

నిష్పాక్షికంగా పరిశీలించాడు. తెలుగులో తిరుపతి దేవస్థానం వారు ప్రచురించిన ఋగ్వేదం వడ్లమూడి గోపాల కృష్ణయ్యగారి పరిష్కరణతో నేమాని వేంటకట నరశింహ శాస్త్రి అనువాదంతో వచ్చింది. అందరికీ అందుబాటులో లేదు అనువాదం. అధర్వ వేదాను వాదం విద్వాన్ విశ్వం వచనంలో సరళ సుందరంగా చేయగలిగారు. ఆధునికతానువాదాలు వ్యాఖ్యానాలు వచ్చినా తెలుగు ఋగ్వేదం ఆధునిక విషయాలు తెలియచేయలేక పోయింది. ఋగ్వేద దిగ్దర్శనంలో కొండూరి వారు తరవాత వచ్చిన తాత్విక సిద్ధాంతాలకు మూలాలు ఋక్కుల్లోనే వున్నాయని చెప్పారు. ఎవరికి ఏది యిష్టమో అది మేధావులకు వేదాల్లో కనపడింది. గీతలాగే వేదం కూడా పలు వ్యాఖ్యానాలకు తావిచ్చింది.

వేద సంస్కృతి హరప్పా నాగరికత నుండి సంక్రమించింది. వేద దేవతలు హరప్పా సంస్కృతి నుండి ఋషులు స్వీకరించారు. ప్రకృతిని ఆరాధించారు. ప్రకృతి సృష్టిస్థితి లయాలకు నిలయం. మానవుడు బతకడానికి కావలసినవి యిస్తుంది. ప్రకృతిలో అనేక ప్రమాదాలను ఎదుర్కోవలసి వస్తుంది. మానవ ప్రయత్న వైఫల్యాలలో ఆరాధనలోకి వెళ్ళిపోతాడు. ప్రకృతిని దైవీకరించారు ఋషులు 'యత్ర విశ్వం భవత్యే కనీడం' విశ్వం పక్షిగూడు అనడం విశ్వజనీన భావన. టాగూరు విశ్వ భారతికి ముఖవాక్యంగా నిర్ణయించాడు.


**నాడు**

మానవతార్ఝురులు పారాయి
మంచి తనం తీరాలు వెలిశాయి
పాప పుణ్యాతీత లోకం శాంతి వెన్నెలను సాకింది
వర్గాలు లేని మానవ స్వర్గాలు
నదుల నాగరికతల్లో తీర్థాలుగా వెలిశాయి.
అని దిగంబర కవి జ్వాలా ముఖి అభి వర్ణించాడు.
ఋగ్వేందంలో 'ఆనో భద్రాః క్రతవో యంతు విశ్వతః'

**Let noble thoughts come to us from every side.** అని అనువాదం, ఉత్తమ ఆలోచనలను ఆహ్వానించారు.

ఋగ్వేదంలో కవిత్వం గురించి పివికానే **History of Sanskrit Poltics** లో వివరించాడు. నదీ సూక్తం, పురూరవ - ఊర్వశీ సూక్త, యమ- యమి సంవాదసూక్తం, ఉషస్సూక్తం మొదలైన వాటిలో మంచి కవిత్వం వుంది.

భారతదేశంలో ప్రథమ సాహిత్య గ్రంథం ఋగ్వేదంలో అనేక విషయాలు ప్రస్తావించ బడినాయి. అధ్యయనం చేస్తూ నూతన భవాలను ఆవిష్కరిస్తూ వస్తున్నారు.



**PALETTE IN THE SKY :** Sunlight reflects off ice crystals in a thundercloud forms a partial spectrum of colour over Riverview, Florida.

MISIMI/మిసిమి RNI Regd. No. 45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd. No. H/SD/191.



**పశ్చాత్తప్త మగదెలీన్**

మొగల్ సంప్రదాయానికి చెందింది (1600 - 1603).
అయితే దీనికి జలవర్ణాలలో పర్షియన్ శైలిని అద్దడమైంది.
చిత్రకారుడు : **జాన్ సాస్టీల్**
(ఇస్లామ్ సంప్రదాయ కళలో ఆరితేరిన ఫ్రాన్స్‌కు చెందిన కళాకోవిదుడు)